RNI
TEL TEL / 2023/ 84132

# అక్షర సవాల్

సామాన్యుడు ప్రశ్నించే గొంతుక

ప్రచురణ-హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ ఎడిటర్: బాదావత్ బాలాజి సంపుటి :04 సంచిక :43 ఆదివారం 10 మే 2026 పేజీలు -8 వెల రూ 5-00

## రద్దీ ఉంటే రిజిస్ట్రేషన్లకు అదనపు పని వేళలు

**రిజిస్ట్రేషన్ల శాఖ అధికార్ల నిర్ణయం**
**అవసరమైతే మరింత సమయాన్ని పెంచుతాం**
**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**హైదరాబాద్, మే 9** : కోర్ అర్బన్ పరిధిలో అత్యధిక రద్దీ ఉండే 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 12 నుంచి పని వేళలను పెంచుతూ రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణ యం తీసుకుంది. ఈ కార్యాలయాల్లో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. భూముల కొత్త మార్కెట్ విలువలను ఈనెల 26 నుంచి అమల్లోకి తేవాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు రద్దీ వల్ల ఇబ్బంది లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం అధికారులను ఆదేశించారు. చంపాపేట, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్లగొండ, పటాన్‌చెరువు, కుత్బుల్లాపూర్ కార్యాలయాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రద్దీకి అనుగుణంగా అవసరమైతే మరింత సమయం పెంచుతామని చెప్పారు.

రిపోర్టర్లు కావలెను

ఈ క్రింది పోస్టులకు అనుభవజ్ఞులు కావలెను
సబ్ ఎడిటర్లు - 02
బ్యూరో చీఫ్ (ఉమ్మడి వరంగల్ జిల్లా) - 01
స్టాఫ్ రిపోర్టర్లు - 06 (జనగాం, మానుకోట, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ)
అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ - 01
యాడ్ ఆఫీసర్స్ - 02
సర్క్యులేషన్ ఆఫీసర్ - 01
అనుభవాన్ని బట్టి వేతనం ఇవ్వబడును.

ఇంకెందుకు ఆలస్యం...
9347332442, 8096677136 నంబర్‌కు
వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

## కవితకు తమిళ ఎన్నికల ఊపు..



**హైదరాబాద్, మే 9:**భారత్ రాజకీయాల్లో తమిళనాడు ఎప్పుడూ కొత్త ట్రెండ్ సృష్టిస్తూ వస్తోంది. తాజా ఫలితాల్లో ఇది మరోసారి రుజువు చేసింది. ఇప్పుడు ఈ మార్పు దేశ రాజకీయాలను మార్చబోతోందనే చర్చ మొదలైంది. ఇప్పుడు ఇక్కడ ప్రజలు ఇచ్చిన తీర్పు ఒక రాష్ట్రానికే పరిమితం కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. తమిళ ప్రజలు పంపిన ఈ సంకేతం దేశమంతటా ప్రతిధ్వనిస్తుందని అభిప్రాయపడ్డారు. తమిళనాడులో కొత్త రాజకీయ శక్తులు, ముఖ్యంగా నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే సాధిస్తున్న విజయాన్ని పరోక్షంగా కవిత ప్రస్తావించారు. దీనిపై సోషల్ మీడియాలో తన అభిప్రాయాన్ని పోస్టు చేశారు. ఆమె మాటల్లో చెప్పాలంటే ఇది కేవలం ఒక ఎన్నికల ఫలితం కాదు, పాత రాజకీయ చరిత్రను తిరగరాయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. భ్రష్టు పట్టిపోయిన - మిగతా5లో

## కాంగ్రెస్ పార్టీలో పదవుల చిచ్చు...



**హైదరాబాద్, మే 9:**అధికారంలోకి వచ్చిన తర్వాత పదవుల పంపకం అనేది ఏ పార్టీకైనా ఒక కత్తిమీద సాము లాంటిదే. పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉండి, కష్టకాలంలో పార్టీ జెండా మోసిన అసలైన కార్యకర్తలకు గుర్తింపు దక్కనప్పుడు వారిలో ఆవేదన కలగడం సహజం. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో కనిపిస్తున్న ఈ పరిణామాలు చూస్తుంటే, పార్టీని గెలిపించిన 'గ్రౌండ్ లెవల్' నేతలు ఇప్పుడు తమ ఉనికి కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అర్థమవుతోంది. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత అసంతృప్తి చల్లారకముందే, ఇప్పుడు ఖమ్మం, మంచిర్యాల జిల్లాల్లో కూడా అసమ్మతి సెగలు రేగడం గమనార్హం తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో పదవుల పంపకం చిచ్చు రేపుతోంది. క్షేత్ర స్థాయిలో పార్టీ కోసం పనిచేసిన తమను విస్మరించి, కొత్తగా వచ్చిన వారికి లేదా ఒకే వర్గానికి పెద్దపీట వేస్తున్నారని సీనియర్ నాయకులు మండిపడుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో రాజీనామాల పర్వం కొనసాగుతుండడం పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ఖమ్మంలో రేణుకా చౌదరి వర్గం ఖమ్మం జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న రేణుకా చౌదరి వర్గం ఇప్పుడు బహిరంగంగానే తమ నిరసనను వ్యక్తం చేస్తోంది. జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల్లో రేణుకా చౌదరి వర్గానికి చెందిన ఒక్క నేతకు కూడా పదవి దక్కకపోవడంపై ఆ వర్గం తీవ్ర ఆగ్రహంతో ఉంది. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. 'పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు పనిచేసిన మాకు గుర్తింపు ఎక్కడ?' అని వారు నిలదీస్తున్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఎమ్మెల్యే వినోద్ గెలుపునకు అహర్నిశలు శ్రమించిన సీనియర్లను కాదని, కొత్త వారికి పదవులు కట్టబెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాలకు నిరసనగా కాసీపేట మండలానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. ఇది పార్టీ క్యాడర్‌లో - మిగతా5లో



## బీఆర్ఎస్ ఖాళీయే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్

**హైదరాబాద్, మే 9:**తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా 8 స్థానాలను కైవసం చేసుకుని, ఓట్ల శాతాన్ని భారీగా పెంచుకున్న కమలదళం, ఇప్పుడు మిషన్ 2028 లక్ష్యంగా పావులు కదుపుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే కాకుండా, బీఆర్ఎస్‌ను మూడో స్థానానికి పరిమితం చేసేలా బీజేపీ అగ్రనాయకత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. పదేళ్లపాటు చక్రం తిప్పిన బీఆర్ఎస్ ప్రస్తుతం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఓటమి తర్వాత ఆ పార్టీ నుంచి వలసలు కొనసాగుతుండగా, వాటిని తమకు అనుకూలంగా మార్చుకోవడంలో బీజేపీ విఫలమవుతోంది. కానీ ఇప్పుడు రూటు మార్చాలనుకుంటోంది. నియోజకవర్గస్థాయి నేతలు లేకపోవడం ఆ పార్టీకి సమస్యగా మారింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ, హైదరాబాద్ - మిగతా5లో



### నేడు తెలంగాణ లో ప్రధాని నరేంద్రమోడీ పర్యటన!

**హైదరాబాద్:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా నేడు తెలంగాణలో పర్య టించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో రూ"9.400 కోట్ల విలువైన వివిధ మౌలిక సదుపాయాలు పారిశ్రామిక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. దీనిలో భాగంగా. రూ 2.360 కోట్లతో జహీరాబాద్ ఇంటి గ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి శంకుస్థాపన చేయనున్నారు. ప్రధాని మోడీ సభ ఏర్పాట్లకు సంబంధించి పార్టీ రాష్ట్ర నేతల మధ్య సమన్వయం సంపూర్ణంగా ఉంది ముఖ్య నేతలంతా మమేకమై ప్రచారం చేస్తున్నారు. అన్ని ప్రాంతాలకు వెళ్లి సభకు తరలిరావాలని పిలుపునిస్తున్నారు. గోడలపై వాల్ రైటింగ్, బైక్ ర్యాలీలు ఇలా ఊరు వాడ పండగ వాతావరణం లో జనాన్ని ఆహ్వానిస్తున్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా సభా ప్రాంగణం మొత్తం జర్మన్ టెంట్లు వేసి ప్రజలకు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, విరివిగా ఏర్పాటు చేస్తున్నారు. నరేంద్ర మోడీ రాకతో మహా నగరం కాస్తా మొత్తం కాషాయమ యం కానుంది. జన సమీకరణ కోసం బిజెపి శ్రేణులు ప్రత్యేక రైళ్లు, ప్రైవేటు బస్సులు ఏర్పాటు చేశారు

## క్యూర్ ప్యూర్ రేర్ మోడల్‌తో తెలంగాణ అభివృద్ధి

**సీఎం రేవంత్**



**హైదరాబాద్, మే 9:** ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవెల్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదని.. మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం వెల్లడించారు. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. జఖ=జు, ౢఖ=జు, =ూ=జుగా అభివృద్ధిని మూడు భాగాలుగా విభజించుకున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు జఖ=జు ఏరియాను సర్వీస్ సెక్టార్‌గా గుర్తించామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట, రీజనల్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ౢఖ=జు ఏరియాను మాన్యూఫ్యాక్చర్ సెక్టార్‌గా గుర్తించామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు బయట ఉన్న =ూ=జు ఏరియాను అగ్రికల్చర్ సెక్టార్‌గా గుర్తించామని అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి సంబంధించి తెలంగాణ రైజింగ్-2047 మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించుకున్నామని ముఖ్యమంత్రి అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు మన సంస్కృతికి అనుసంధానం చేయబోతున్నట్లు తెలిపారు. నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఈవీ బస్సులను తీసుకొస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



## హైదరాబాద్ లో నీటిగండం..

**హైదరాబాద్, మే 9:**ఎండ తీవ్రత ఎలా పెరుగుతుందో.. హైదరాబాద్ లో నీటి కష్టాలు కూడా అలాగే పెరుగుతున్నాయి. ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. వేసవి ఇంకా ముగియకముందే భూగర్భ జలాలు ఇంత దారుణంగా అడుగంటిపోవడం రాబోయే రోజుల్లో ఎదురయ్యే నీటి ఎద్దడికి ముందస్తు హెచ్చరికగా కనిపిస్తోంది. నగరం కాంక్రీట్ అడవిలా మారుతున్న తరుణంలో, వర్షపు నీరు భూమిలోకి ఇంకే మార్గం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోందన్నది కాదనలేని వాస్తవం. హైదరాబాద్ మహానగరంలో భూగర్భ జల మట్టాలు ప్రమాదకర స్థాయికి పడిపోతున్నాయి. కేవలం ఒక్క నెలలోనే నీటి మట్టం గణనీయంగా తగ్గిపోవడం గ్రేటర్ వాసులను భయాందోళనలకు గురిచేస్తోంది. భూగర్భ జల శాఖ తాజా గణాంకాల ప్రకారం, నగరంలోని మెజారిటీ ప్రాంతాల్లో బోర్లు ఎండిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ప్రమాదకర స్థాయికి నీటి మట్టాలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో భూగర్భ జలాల పరిస్థితి ఇలా ఉంది. హైదరాబాద్‌లోని - మిగతా5లో

## పొలిటికల్ గేమ్... షురూ...

### సీబీఐ భుజంపై రేవంత్ తుపాకి....



**హైదరాబాద్, మే 9:**తెలంగాణలో ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఇంకో రెండేళ్ల తర్వాత జరగబోయే ఎలక్షన్స్ కోసం ఇప్పటినుంచే ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి పార్టీలు. సీఎం రేవంత్ రెడ్డి అయితే..బీఆర్ఎస్, బీజేపీ కంటే ఓ అడుగు ముందుకేసి..నెక్ట్ లెవల్ ప్లానింగ్స్ చేస్తున్నారట. రాజకీయ ప్రత్యర్థులైన బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని చెప్పేందుకు ఒక దెబ్బకు రెండు పిట్టలు అనేలా పొలిటికల్ వెపన్స్ బయటికి తీస్తున్నారట. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ అంటూ లేఖ రాసి..చర్చకు తెరలేపారు. తాము లేఖ రాసి నెలలు గడిచిపోతున్నా..ఇప్పటివరకు సీబీఐ నుంచి రెస్పాన్స్ లేదంటూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని బీఆర్ఎస్ తో కలుపుతూ - మిగతా5లో

## నిప్పులు చెరుగుతున్న సూరీడు.



**హైదరాబాద్, మే 9:**తెలంగాణలో ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి. ఇన్నాళ్లూ ఒక మోస్తరుగా ఉన్న ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడగ విప్పాయి. ఎండల తీవ్రత భారీగా పెరగనుందని, ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ మార్కును దాటుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేస్తూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత అత్యధికంగా ఉండనుంది. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో భానుడి భగభగలు మొదలయ్యాయి. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అదనంగా - మిగతా5లో

## సంపాదకీయం

# విజయ్ కంటే.. రాజేంద్ర అర్లేకరే ఫేమస్

దేశవ్యాప్తంగా కొద్దిరోజులుగా తమిళనాడు రాజకీయాలు సృష్టిస్తున్న సంచలనం మామూలుగా లేదు. ఈ ఎన్నికల్లో తమిళనాడు ప్రజలు ఏ పార్టీకి కూడా వన్ సైడ్ విక్టరీ ఇవ్వలేదు. ప్రభుత్వ వ్యతిరేకతను.. ప్రతిపక్షం పార్టీ మీద ఉన్న ఆగ్రహాన్ని ఏకకాలంలో ప్రదర్శించారు. అభిమానాన్ని కూడా చూపించారు. ఫలితంగా మూడు పార్టీలలో దేనికి కూడా గొప్పగా చెప్పుకునే మెజారిటీ రాలేదు. దీంతో ఈసారి తమిళనాడులో బంపర్ మెజారిటీ ఏ పార్టీ సాధించలేకపోయింది. కనీసం మ్యాజిక్ ఫిగర్ కు దగ్గరగా కూడా రాలేకపోయింది. దీంతో పొత్తులు.. సంకీర్ణాల గురించి చర్చ నడుస్తూనే ఉంది. అయితే ఇంతవరకు తమిళనాడులో ఏర్పడిన సందిగ్ధం తీరలేదు.విజయ్ పార్టీకి అత్యధికంగా స్థానాలు వచ్చినప్పటికీ.. ఆయనకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బలం లేదు. ఇతర పార్టీల నేతలను కూడగట్టే ప్రయత్నం చేసినప్పటికీ అది సాధ్యం కావడం లేదు. దీంతో తమిళనాడులో రకరకాల రాజకీయాలు సాగుతూ ఉన్నాయి. ఇప్పటికే డీఎంకే తమిళనాడు రాజకీయాల మీద క్లారిటీ ఇచ్చేసింది. తాము ఎవరికి సపోర్ట్ చేయమని.. ప్రజల ఓటింగ్ ద్వారా లభించిన ప్రతిపక్ష స్థానాన్ని కొనసాగిస్తామని డీఎంకే అధినేత స్టాలిన్ ప్రకటించారు. దీంతో తమిళనాడులో రాజకీయాలు మరో మలుపు తీసుకున్నాయి. ఇప్పటికే రిసార్ట్ నుంచి ఎమ్మెల్యే విజయ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బుధవారం గవర్నర్ ను కలిశారు. కాకపోతే గవర్నర్ అడిగిన ప్రశ్నలకు టీవీకే అధినేత వద్ద సమాధానాలు లేకుండా పోయాయి. దీంతో గురువారం జరగాల్సిన ప్రమాణ స్వీకారం రద్దయింది. అంతేకాదు ఇప్పట్లో తమిళనాడులో ప్రభుత్వం ఏర్పడే అవకాశం కనిపించడం లేదు.తమిళనాడు రాజకీయాల్లో ఈ సందిగ్ధత కొనసాగుతున్న నేపథ్యంలో ఒక వ్యక్తి విజయ్ కంటే ఎక్కువ ప్రాచుర్యం పొందారు. మీడియా కూడా ఆయన గురించి విశేషంగా కథనాలను ప్రసారం చేస్తోంది. ఆ వ్యక్తి రాజకీయాలతో సంబంధం ఉన్నవారు కాదు. పార్టీలతోనూ సంబంధం ఉన్నవారు కాదు. ఆయన మరెవరో కాదు తమిళనాడు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్. ఇటీవల విజయ్ గవర్నర్ కార్యాలయం వద్దకు వెళ్లినప్పుడు రాజేంద్ర సాదరంగా స్వాగతం పలికారు. మెజారిటీ చూపిస్తేనే టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇస్తామని అన్నారు. దీంతో రాజేంద్ర మీద తీవ్రస్థాయిలో చర్చ జరుగుతుంది. కొన్ని పార్టీలు రాజేంద్ర తీరును తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నాయి. ఆయన వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం బాగోలేదని మండిపడుతున్నాయి. కమలహాసన్ నుంచి మొదలు పెడితే విశాల్ వరకు అందరు గవర్నర్ తీర్పట్ల మండిపడుతున్నారు.తమిళనాడు రాజకీయాలలో సస్పెన్స్ వీడటం లేదు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ టీవీకే పార్టీకి.. ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ అనుమతి ఇవ్వకపోవటంపై సర్వత్రా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడు రాజకీయ పరిణామాలపై లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా తాజా రాజకీయ పరిణామాలు, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకే విజయ్‌ను గవర్నర్ అనుమతించకపోవటం అన్యాయమైన చర్యగా జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు.గవర్నర్ తీరు అప్రజాస్వామికమే కాకుండా.. రాజ్యాంగ స్ఫూర్తికి, మౌలిక సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వానికి శాసనసభ మద్దతు ఉందా, లేదా అనే విషయం తేల్చాల్సింది అసెంబ్లీలో కానీ.. రాజ్‌భవన్‌లో (లోక్ భవన్) కాదని జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని.. విజయ్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించేలా గవర్నర్‌కు సూచించాలని అన్నారు. బలనిరూపణ ద్వారా శాసనసభలో ప్రభుత్వాన్ని ఓడించేంత వరకూ.. మైనారిటీ ప్రభుత్వమైనా పాలన సాగించవచ్చని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు గతంలో ఎన్నో జరిగాయన్న జేపీ.. 1969లో కాంగ్రెస్ చీలిక తర్వాత ఇందిరా గాంధీ ప్రభుత్వం ఏర్పాటు, 1991 నుంచి 1996 వరకూ పీవీ నరసింహారావు పాలనను గుర్తు చేశారు.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత రాజకీయాలు చేసే హక్కు గవర్నర్లకు లేదని జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేశారు. తమిళనాడులో ప్రస్తుతమున్న రాజకీయ సంస్కృతిని తిరస్కరిస్తూ తమిళ ప్రజలు అసాధారణమైన తీర్పును ఇచ్చారని.. గవర్నర్ ఆ తీర్పును అగౌరవపరచడం రాజకీయాలపై ప్రజల విశ్వాసాన్ని మరింత దెబ్బతీసి, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుందని జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలు.. వీధి పోరాటాలకు, ప్రభుత్వాల పతనానికి ఎలా దారితీస్తాయో పొరుగు దేశాలలో చూశామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా వివేకం, ముందుచూపుతో వ్యవహరించి, తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అతిపెద్ద పార్టీగా నిలిచినవారిని ఆహ్వానించమని గవర్నర్‌కు సలహా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాజ్యాంగ విలువల పరిరక్షణకు రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని.. గవర్నర్ ఇంకా మొండిగా వ్యవహరిస్తే, అతడిని తక్షణమే తొలగించాలని సూచించారు. రాజేంద్ర 1989లో బిజెపిలో చేరారు. 2002, 2012లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2017లో స్పీకర్ గా దేశంలోనే మొట్టమొదటిసారిగా కాగిత రహిత అసెంబ్లీ ని రూపొందించారు. రాజ్యాంగ సూత్రాలను ఈయన నూటికి నూరుపాళ్ళు అమలు చేస్తారు. 2025 నుంచి కేరళ రాష్ట్రానికి గవర్నర్ గా ఉన్నారు. తమిళనాడు రాష్ట్రానికి ఇన్చార్జి గవర్నర్ గా వ్యవహరిస్తున్నారు.

# సముద్రంలో అంతు చిక్కని వైరస్

**హైదరాబాద్, మే 9:**సముద్రంలో ఎన్నో రకాల జంతువులు ఉంటాయి. వాటితో పాటు కంటికి కనిపించని జంతువులు కూడా ఉంటాయి. ఈ భూభాగంలో ఉన్న సముద్రాలలో శాస్త్రవేత్తలు నిత్యం పరిశోధనలు చేస్తూనే ఉంటారు. సముద్రంలో అంతుచిక్కని జంతువులతోపాటు.. అంతకుమించిన రహస్యాలు ఉంటాయి. మనిషి జీవితానికి సంబంధించి ఎన్నో రకాలైన వస్తువులు సముద్రం ద్వారా లభిస్తున్నాయి. మనం నిత్యం వాడే ఇంటర్నెట్ కూడా సముద్రం అంతర్భాగంలో ఏర్పాటు చేసిన కేబుల్స్ ద్వారా వస్తూ ఉంటుంది.కెరటాలు, అలలు.. విస్తారమైన మత్స్య సంపదకు నిలయమైన సముద్రాలలో ఇప్పుడు వైరస్ కలకలం నెలకొంది. ఈ వైరస్ కు అట్లాంటిక్ సముద్రం కేంద్రంగా మారింది. ఈ సముద్రంలో ప్రయాణం సాగిస్తున్న ఒక క్రుజ్ నౌక లో వైరస్ కలకలం సృష్టిస్తోంది. అందులో ఇద్దరు



భారతీయులు కూడా ఉండడం ఆందోళన కలిగిస్తుంది.అట్లాంటి సముద్రంలోని కానరీ ఐలాండ్స్ కు ప్రయాణిస్తున్న నౌకలో అంట అనే వైరస్ కలకలం రేపుతోంది. 149 మంది ప్రయాణికులు ఈ ఓడలో ప్రయాణిస్తున్నారు. వైరస్ వల్ల ఇప్పటికే ముగ్గురు చనిపోయారు. మరో 8 మందికి వైరస్ సోకినట్టు సమాచారం. ఈ ఓడలో ఇద్దరు భారతీయులు కూడా ప్రయాణిస్తున్నారు. వారికి సంబంధించిన సమాచారం ఇంతవరకు లేదు. ఈ ఓడలో దాదాపు 23 దేశాలకు సంబంధించిన ప్రయాణికులు ఉన్నారు.ఎలుకల ద్వారా ఈ వైరస్ సోకుతూ ఉంటుంది. తీవ్రమైన వ్యాధులకు గురైన ఎలుకలలో ఈ వైరస్ ఉంటుంది. ఇది అంటువ్యాధి లాగా వ్యాపిస్తుంటుంది. ఆ ఓడలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు కూడా ఈ వైరస్ దొరికింది. అలసట.. తీవ్రమైన జ్వరం.. విపరీతమైన కండరాల నొప్పి.. భరించలేని దగ్గు.. ఊపిరి తిత్తులలో నీరు చేరడం వంటివి ఈ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి సోకితే బతకడం కష్టమని వైద్యులు అంటున్నారు. అయితే ఈ కేసులు మరింత పెరిగే ప్రమాదం ఉందని ప్రపంచ వైద్య ఆరోగ్య సంస్థ అంచనా వేస్తోంది.

# గోల్డ్ డీప్ గ్యాంగ్ పనే...

**కరీంనగర్, మే 9:**కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలరీ షాపులో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో విచారణ వేగంగా కొనసాగుతోంది. ఈ కేసు పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. చోరీ జరిగి ఐదు రోజులైనా దొంగలను పట్టుకోలేదు. కానీ కీలక ఆధారాలను మాత్రం సేకరించారు. ఈ చోరీ తర్వాత పోలీసులు, అధికార పార్టీ నేతలు, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇది పోలీసులపై మరింత ఒత్తిడి పెంచుతోంది. ఈ భారీ దోపిడీ ఒక్కసారిగా తెలంగాణ పోలీసుల అవగాహనను మార్చేసింది. కోట్ల విలువైన ఆభరణాలు ఎత్తుకెళ్లడంతో ఈ సంఘటన వెనుక బిహార్ మూలాలు కలిగిన ఆరుగురు సభ్యుల అంతర్రాష్ట్ర 'గోల్డ్ థీఫ్' గ్యాంగ్ ఉందని పోలీసులు నిర్ధారించారు.ఈ ముఠా ఉత్తరప్రదేశ్‌లో అనేక కిడ్నాపింగ్ కేసుల్లో చిక్కుకుంది. వారు ధనవంతులను లక్ష్యంగా చేసుకుని డబ్బు వసూళ్లు చేసి, బంగారు దోపిడీల వైపు మళ్లారు. బిహార్ నుంచి తెలంగాణకు వలస వచ్చిన వీరు ధర్మపురి, పెద్దపల్లి ప్రాంతాల్లో లాడ్జీలు బుక్ చేసుకుని వారం రోజులు రెక్కీ నిర్వహించారు. గ్యాంగ్ లీడర్ గతంలో జైలు శిక్ష అనుభవించాడని సమాచారం. వారి నెట్‌వర్క్ దక్షిణ భారతదేశంలో విస్తరిస్తోంది.దోపిడీ తర్వాత స్థానిక సినిమా ఫక్కీల్లో తమ ఆధారాలు వదిలి వెళ్లారు. ఇది పోలీసుల దృష్టిని స్థానికుల వైపు తిప్పడానికి వ్యూహాత్మక చర్య. ఫోరెన్సిక్ టీమ్ ఈ ఆధారాల నుంచి డీఎన్ఏ, మొబైల్ ట్రాకింగ్ ద్వారా గ్యాంగ్‌ను గుర్తించింది. ఈ టెక్నిక్ వారి సంక్లిష్ట 'రెడ్ హెర్రింగ్' వ్యూహం భాగం.కరీంనగర్ పోలీసులు, బిహార్, ఉత్తరప్రదేశ్ పోలీసులతో కోఆర్డినేట్ అవుతున్నారు. రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు. డ్రోన్‌లు, ఏఐ టూల్స్‌తో గాలింపు ముమ్మరం చేశారు. ఇప్పటికే రెండు వాహనాలు సీజ్ చేశారు. పోలీసు అధికారి ప్రకారం, 48 గంటల్లోపు అరెస్టులు జరుగుతాయి.గతేడాది ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి గ్యాంగ్ దోపిడీ చేసింది. దక్షిణ భారతదేశంలో బిహార్ ముఠాలు 30 శాతం పెరిగాయి. ఆర్థిక పురోగతితో జ్యువెలరీ లక్ష్యాలు ఎక్కువవుతున్నాయి.

# లాభాలు పండిస్తున్న యుద్ధం...

ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా, ప్రపంచవ్యాప్తంగా సామాన్యులు ఆర్థిక భారంతో సతమతమవుతుంటే, కొన్ని కంపెనీలు భారీ లాభాలు గడిస్తున్నాయి.యుద్ధం సృష్టించిన అనిశ్చితితో పాటు ఇరాన్ 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్'ను మూసివేయడం వల్ల ప్రజల జీవన వ్యయం భారీగా పెరిగింది. దీని ప్రభావం కంపెనీలు, కుటుంబాలు, ప్రభుత్వాల బడ్జెట్‌లపై తీవ్రంగా పడింది.ఇలా ఒకవైపు అనేకమంది ఆర్థికంగా కుదేలై దివాలా అంచున నిలబడితే, మరోవైపు యుద్ధ సమయాల్లో ఎక్కువ లాభాలు పొందే వ్యాపారాలు, అస్థిరమైన ఇంధన ధరల ద్వారా లబ్ధి పొందే మరికొన్ని సంస్థలు మాత్రం రికార్డు స్థాయిలో సంపాదనను కళ్ల చూస్తున్నాయి.ఇరాన్ యుద్ధం కారణంగా ఇప్పటిదాకా కనిపించిన అతిపెద్ద ఆర్థిక ప్రభావం ఇంధన ధరల పెరుగుదలే.ప్రపంచంలోని చమురు, సహజ వాయువులలో దాదాపు ఐదో వంతు (20 శాతం) 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్' ద్వారా రవాణా అవుతుంది. అయితే, ఫిబ్రవరి చివరి నాటికి ఈ రవాణా దాదాపు పూర్తిగా నిలిచిపోయింది. ఫలితంగా ఇంధన మార్కెట్లలో ధరల హెచ్చుతగ్గులు ఒక 'రోలర్ కోస్టర్'లా మారిపోయాయి.ఈ పరిస్థితిని ప్రపంచంలోని కొన్ని అతిపెద్ద చమురు, గ్యాస్ కంపెనీలు తమకు అనుకూలంగా మార్చుకుని భారీగా లాభపడ్డాయి.ప్రధానంగా ఐరోపాకు చెందిన దిగ్గజ చమురు సంస్థలు లబ్ధి పొందాయి.ఈ కంపెనీలకు సొంతంగా ట్రేడింగ్ విభాగాలు ఉండటంతో, మార్కెట్‌లో ధరల్లో వచ్చిన భారీ మార్పులను తమకు అనుకూలంగా మార్చుకుని లాభాలు పెంచుకోగలిగాయి.ముఖ్యంగా బ్రిటిష్ పెట్రోలియం (బీపీ) కంపెనీ లాభాలు ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే రెండింతలు పెరిగి 3.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.30,230 కోట్లు)కు చేరుకున్నాయి. తన ట్రేడింగ్ విభాగం కనబరిచిన 'అసాధారణ' పనితీరు వల్లే ఈ స్థాయిలో లాభాలు వచ్చాయని సదరు కంపెనీ పేర్కొంది.షెల్ కంపెనీ తన మొదటి త్రైమాసిక లాభాలు 6.92 బిలియన్ డాలర్ల (సుమారు రూ.65,379 కోట్లు)కు పెరిగినట్లు నివేదించింది. ఇది విశ్లేషకుల అంచనాలను కూడా మించిపోయింది.మరో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ 'టోటల్ ఎనర్జీస్' చమురు, ఇంధన మార్కెట్లలోని హెచ్చుతగ్గుల కారణంగా 2026 మొదటి త్రైమాసికంలో తన లాభాలను దాదాపు మూడో వంతు పెంచుకుని, 5.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.51,014 కోట్లు)కు చేరుకుంది.మధ్యప్రాచ్యంలో ఇంధన సరఫరాకు ఏర్పడిన ఆటంకాల కారణంగా అమెరికా దిగ్గజ సంస్థలు ఎక్సాన్ మొబిల్, షెవ్రాన్ ఆదాయాలు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే తగ్గాయి.అయితే, ఈ రెండు కంపెనీలు విశ్లేషకుల అంచనాలను మించి రాణించాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి కంటే చమురు ధరలు ఇప్పటికీ గణనీయంగా ఎక్కువగానే ఉండటంతో, ఈ ఏడాది గడిచేకొద్దీ తమ లాభాలు మరింత పెరుగుతాయని అవి భావిస్తున్నాయి.కొన్ని అతిపెద్ద బ్యాంకులు కూడా ఇరాన్ యుద్ధ సమయంలో తమ లాభాలను భారీగా పెంచుకున్నాయి.జేపీ మోర్గాన్ ట్రేడింగ్ విభాగం 2026 మొదటి మూడు నెలల్లో రికార్డు స్థాయిలో 11.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1,09,585 కోట్లు) ఆదాయాన్ని ఆర్జించింది. ఇది ఆ బ్యాంక్ మొత్తం మీద తన చరిత్రలోనే రెండవ అతిపెద్ద త్రైమాసిక లాభాన్ని నమోదు చేయడంలో సహాయపడింది.అలాగే బ్యాంక్ ఆఫ్ అమెరికా, మోర్గాన్ స్టాన్లీ, సిటీ గ్రూప్, గోల్డ్‌మన్ సాక్స్, వెల్స్ ఫార్గో వంటి మిగిలిన 'బిగ్ సిక్స్' బ్యాంకులన్నీ కూడా ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో గణనీయమైన లాభాలను సాధించాయి.మొత్తంగా, ఈ బ్యాంకులు 2026 మొదటి మూడు నెలల్లో 47.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4,50,621 కోట్లు) లాభాలను నివేదించాయి.భారీ స్థాయిలో జరిగిన ట్రేడింగ్ లావాదేవీలు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులకు, ముఖ్యంగా మోర్గాన్ స్టాన్లీ, గోల్డ్‌మన్ సాక్స్ సంస్థలకు బాగా లబ్ధి చేకూర్చాయి" అని వెల్త్ క్లబ్ ప్రధాన ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ సుసానా స్ట్రీటర్ పేర్కొన్నారు.పెట్టుబడిదారులు రిస్క్ ఎక్కువగా ఉండే స్టాక్స్, బాండ్లను వదిలించుకుని, సురక్షితమైన ఆస్తులలో పెట్టుబడి పెట్టడానికి పోటీ పడటంతో ట్రేడింగ్‌కు పెరిగిన డిమాండ్ వాల్ స్ట్రీట్ రుణదాతలకు బాగా కలిసివచ్చింది.అలాగే, ఆర్థిక మార్కెట్లలో నెలకొన్న అస్థిరతను సొమ్ము చేసుకోవాలని పెట్టుబడిదారులు ప్రయత్నించడం వల్ల కూడా ట్రేడింగ్ లావాదేవీల పరిమాణం గణనీయంగా పెరిగింది."యుద్ధం వల్ల తలెత్తిన అస్థిరత ట్రేడింగ్ ఒక్కసారిగా పెరగడానికి కారణమైంది. పరిస్థితులు మరింత విషమిస్తాయన్న భయంతో కొందరు పెట్టుబడిదారులు తమ స్టాక్స్‌ను విక్రయించగా, మరికొందరు తక్కువ ధరల్లో కొనుగోలు చేశారు. ఇది మార్కెట్ మళ్లీ పుంజుకోవడానికి దోహదపడింది" అని స్ట్రీటర్ విశ్లేషించారు.ఎఫ్-35 ఫైటర్ జెట్ భాగాల సహా వివిధ ఉత్పత్తులను తయారుచేసే బీఏఈ సిస్టమ్స్, ట్రేడింగ్ అప్‌డేట్‌లో ఈ ఏడాది అమ్మకాలు, లాభాల్లో బలమైన వృద్ధిని ఆశిస్తున్నట్లు తెలిపింది.ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న 'రక్షణపరమైన ముప్పులు' ప్రభుత్వ రక్షణ వ్యయాన్ని పెంచుతున్నాయని, ఇది తమ కంపెనీకి 'అనుకూలమైన వాతావరణాన్ని' సృష్టించిందని ఆ సంస్థ పేర్కొంది.ప్రపంచంలోని అతిపెద్ద రక్షణ కాంట్రాక్టర్లలో మూడు సంస్థలైన లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, నార్త్రోప్ గ్రుమ్మన్ 2026 మొదటి త్రైమాసికం చివరి నాటికి తమ వద్ద రికార్డు స్థాయిలో ఆర్డర్లు పేరుకుపోయినట్లు నివేదించాయి.అయితే, గత కొన్నేళ్లుగా విపరీతంగా పెరిగిన రక్షణ రంగ సంస్థల షేర్లు, మార్చి మధ్య కాలం నుంచి తగ్గుముఖం పట్టాయి. ఈ రంగంలోని షేర్ల విలువ వాస్తవ స్థాయి కంటే ఎక్కువగా ఉందనే ఆందోళనల మధ్య ఈ క్షీణత కనిపిస్తోంది.

# పంచాయితీ ఎన్నికలకు అంతా సిద్ధం

**విజయవాడ, మే 9:**స్థానిక సంస్థల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఇదే విషయాన్ని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీలతోపాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, నగరపాలక సంస్థలకు సంబంధించిన పదవీకాలం ముగిసింది. ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఆరు నెలల్లోపు స్థానిక సంస్థల ఎన్నికలకు నిర్వహించాలన్నది ఒక నిబంధన. ఇప్పుడు సీఎం చంద్రబాబు తాజా ప్రకటనతో ప్రభుత్వం వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని చూస్తున్నట్లు అర్థం అవుతోంది. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు వస్తేనే ఆర్థిక సంఘం నిధులు విడుదల అయ్యే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వం వాటి ఎన్నికల నిర్వహణపై ప్రత్యేకంగా ఫోకస్ చేసినట్లు అర్థమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకు పైగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వాటికి సంబంధించి సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2 తో ముగిసింది. దీంతో సర్పంచులు మాజీలు అయ్యారు. వారి స్థానంలో పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది ప్రభుత్వం. అయితే పాలకవర్గాలు




లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులకు బ్రేక్ పడే అవకాశం ఉంది. ఇప్పటికే 16వ ఆర్థిక సంఘం సమయం ప్రారంభం అయింది. దాదాపు 15 వేల కోట్ల రూపాయల వరకు ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యే ఛాన్స్ కనిపిస్తోంది. పంచాయితీలకు పాలకవర్గాలు ఉంటేనే ఈ నిధులు మంజూరయ్యేవి. అందుకే వీలైనంత త్వరగా పంచాయతీ ఎన్నికలను పూర్తి చేసి 16వ ఆర్థిక సంఘం నిధులతో.. పెద్ద ఎత్తున అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 12 కార్పొరేషన్ల తో పాటు 123 మున్సిపాలిటీలు/ నగర పంచాయతీలు ఉన్నాయి. వీటికి సంబంధించి పదవీకాలం మార్చి 17 తో ముగిసింది. ప్రస్తుతం ఆర్డీవో స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా ఉన్నారు. అయితే పాలకవర్గాలు లేకపోవడంతో పట్టణాల్లో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. అందుకే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. వార్డుల విభజనకు సంబంధించిన ప్రక్రియ కూడా జరుగుతోంది. ఇక మండల పరిషత్ తో పాటు జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించిన గడువు జూన్ వరకు ఉంది. మండల పరిషత్ అధ్యక్షులతోపాటు జిల్లా పరిషత్ అధ్యక్షుల పదవీకాలం జూన్ తో ముగియనుంది. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా పరిషత్ కీలక పాత్ర పోషిస్తూ వస్తోంది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన బాధ్యత జిల్లా పరిషత్ లది. అందుకే వీటి ఎన్నిక సైతం వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అనేక రకాల పిటిషన్లు కోర్టుల్లో దాఖలు అయ్యాయి. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అభ్యంతరాలు ఉన్నాయి. అయితే బీసీ గణన తర్వాత రిజర్వేషన్లపై స్పష్టత వస్తుందని ప్రభుత్వం చెప్పింది. అయితే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మాత్రం వేసవి తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే ఛాన్స్ కనిపిస్తోంది.

# బొల్లోనిపల్లిలో ఘనంగా కంఠ మహేశ్వరుని విగ్రహ ప్రతిష్టాపన

**ఉత్సవాల్లో పాల్గొన్న మోకుదెబ్బ రమేష్ గౌడ్**

**ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం**





**నల్లబెల్లి, మే 9 అక్షర సవాల్:** నల్లబెల్లి మండలం బొల్లోనిపల్లి (అర్షనపల్లి) గ్రామంలో శ్రీ కంఠ మహేశ్వరుని ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ కంఠ మహేశ్వర స్వామి, సూరమాంబ దేవి, రేణుక ఎల్లమ్మ, వనం మైసమ్మ, పోతారాజు విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌడ జన హక్కుల పోరాట సమితి 'మోకుదెబ్బ' రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం నుంచే ఆలయాన్ని మామిడి తోరణాలతో అలంకరించగా, గౌడ సభ్యుల మాలధారణ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. విగ్రహాలను తిప్పని యశోద, సాయిలు గౌడ్ దంపతుల కుమారుడు తిప్పని రాజయ్య గౌడ్ జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా తిప్పని విజయ--సాంబయ్య గౌడ్, తిప్పని లక్ష్మి--రవీందర్ గౌడ్, తిప్పని రజిత--మహేందర్ గౌడ్, తిప్పని సృజన--లింగమూర్తి గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దమనుషులు తిప్పని సాంబయ్య గౌడ్, మేడిపల్లి ప్రసాద్ గౌడ్, అధ్యక్షుడు కోటగిరి దేవేందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు గాజర్ల రాజు గౌడ్, కార్యదర్శి కోటగిరి రమేష్, బోడిగే రాజు గౌడ్‌తో పాటు గాజర్ల రాంచంద్రు గౌడ్, గాజర్ల సారంగపాణి గౌడ్, తిప్పని సంపత్ గౌడ్, గట్టు సారయ్య గౌడ్, జక్కి రాములు గౌడ్, పిడిమల్ల రాజేష్ గౌడ్, స్వామి గౌడ్, సమ్మాలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# "అసెంబ్లీ టైగర్" ఓంకార్ శతజయంతి సభకు కదలిరండి

**నల్లబెల్లిలో ఎంసిపిఐ(యు) నేతల వాల్ పోస్టర్ల విడుదల.. వేలాదిగా తరలిరావాలని పిలుపు**




**నల్లబెల్లి, మే 9 అక్షర సవాల్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, "అసెంబ్లీ టైగర్"గా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిన అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ ముగింపు సభను విజయవంతం చేయాలని ఎంసిపిఐ(యు) నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం నల్లబెల్లి మండల కేంద్రంలో ఎంసిపిఐ(యు) మండల కమిటీ ఆధ్వర్యంలో సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఘనంగా విడుదల చేశారు. మే 12, 2026 మంగళవారం సాయంత్రం 4 గంటలకు నర్సంపేటలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో నిర్వహించనున్న మహాసభకు రైతులు, కార్మికులు, యువజనులు, మహిళలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా ఎంసిపిఐ(యు) మండల కార్యదర్శి దామ సాంబయ్య, మండల సహాయ కార్యదర్శి మార్తా నాగరాజు మాట్లాడుతూ.. "కామ్రేడ్ ఓంకార్ గారు 1972 నుంచి 1994 వరకు వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి చట్టసభలను ప్రజా పోరాటాల వేదికగా మలిచారు. భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాల్లో, ప్రజా హక్కుల సాధనలో అసెంబ్లీలో గర్జించిన అసెంబ్లీ టైగర్ ఆయన. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని నేటి తరాలకు అందించిన మహానేతకు ఇదే నిజమైన నివాళి" అని పేర్కొన్నారు. ఓంకార్ ఆశయ సాధన కోసం నల్లబెల్లి మండలం నుంచి వేలాదిమంది రైతులు, హమాలీలు, కూలీలు, మహిళలు సభకు తరలివెళ్లి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్డిడబ్ల్యూ మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మార్తా సుధ, కనకం కోర్నల్, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# స్వీయ జనగణనకు నేడే చివరి రోజు...

**ములుగు జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్...**



**ములుగు ప్రతినిధి, అక్షర సవాల్ :** స్వీయ జనగణనలో ఒక్క రోజే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. 2027 జనగణనలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా స్వీయ గణన చేసుకునేందుకు ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉన్నదని తెలిపారు. ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. https://se.census.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఇంటి వద్ద నుండే సులభంగా స్వీయ గణన నమోదు చేసుకోవాలని అన్నారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియ పూర్తి సులభంగా నమోదు చేయవచ్చని, నచ్చిన భాషను ఎన్నుకొని వివరాలు నమోదు చేయాలని తెలిపారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన స్వీయ గణన ఆన్లైన్ నమోదు కార్యక్రమం ఈ నెల 10వ తేదీతో ముగుస్తుందని స్పష్టంచేశారు. జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి జనగణన నిర్వహిస్తారని వివరించారు. ఈ నెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి హౌస్ లిస్టింగ్ చేపడతారని తెలిపారు.దేశ ప్రణాళిక, భవిష్యత్ అభివృద్ధి, వనరుల పంపిణీకి జనగణన కీలకమని కలెక్టర్ తెలిపారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్నవారు కూడా తమ ప్రస్తుత నివాసం నుండే వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు.జనగణన సందర్భంగా అందరూ తమ కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను ఖచ్చితంగా అందించాలని కోరారు. ఈ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, జనాభా లెక్కలకు మాత్రమే ఉపయోగించబడతాయని స్పష్టం చేశారు. ఆన్లైన్ నమోదు తదుపరి ఎన్యుమరేషన్ ఐడి వస్తుందని, అట్టి నంబర్ ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని తెలిపారు. ఒక్క రోజే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ స్వీయ గణనలో పాల్గొనాలని ఆయన సూచించారు.

# ఎండల్లో చల్లని సేవ.. 2,500 మందికి ఉచిత మజ్జిగ పంపిణీ



**అల్లం బాల కిషోర్ రెడ్డి ఫౌండేషన్ 'దాహ నివారణ సేవ'కు విశేష స్పందన**

**గీసుకొండ, మే 9 అక్షర సవాల్:** వేసవి ఎండలు భగ్గుమంటున్న వేళ రైతులు, పశువుల వ్యాపారులు, ప్రయాణికులకు చల్లని ఉపశమనం కల్పించే లక్ష్యంతో అల్లం బాల కిషోర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత "శీతల మజ్జిగ పంపిణీ -- దాహ నివారణ సేవ" కార్యక్రమం కొమ్మాల అంగడి ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ప్రజా సేవే ధ్యేయంగా అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి ఆలోచనతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా దాదాపు 2,500 మందికి పైగా రైతులు, పశువుల వ్యాపారులు, ప్రయాణికులకు ఉచితంగా చల్లని మజ్జిగ పంపిణీ చేసి ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించారు. మండుతున్న ఎండల్లో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, సమాజ సేవకులు అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి, గీసుకొండ సర్పంచ్ వీరగోని రాజకుమార్, జిల్లా నాయకులు అల్లం మర్రెడ్డి స్వయంగా పాల్గొని మజ్జిగ పంపిణీ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలతో మమేకమై సేవ చేయాలనే వారి తపన కార్యక్రమం ద్వారా స్పష్టమైంది. ఈ కార్యక్రమంలో కొమ్మాల సర్పంచ్ కన్నెబోయిన యమున ప్రవీణ్, దర్శు తండా సర్పంచ్ కేలోతు అమృత బిక్షపతి, సూర్య తండా సర్పంచ్ బానోతు రాఘవేంద్ర, టీం ఏబీఆర్ మచ్చపూర్ కంటెస్టెడ్ సర్పంచ్ వేల్పుల మమతా సురేష్, మాజీ ఎంపీటీసీ బానోతు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కేలోతు స్వామితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సంవత్సరానికి కోటి ఉద్యోగాల హామీ ఏమైంది - డివైఎఫ్ఐ ప్రశ్న...

**రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వద్ద నిరుద్యోగ యువత సమావేశం**






**హన్మకొండ, అక్షర సవాల్ :** కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి కోటి ఉద్యోగాల హామీని అమలు చేయలేదని, యువతను, నిరుద్యోగులను మోసం చేసిందని అఖిల భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిల తిరుపతి ఆరోపించారు.ఖాజీపేట లోని అయోధ్య పురం కోచ్ ఫ్యాక్టరీ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రైల్వేలో ఉమ్మడి జిల్లా నిరుద్యోగ యువకుల సమావేశం శనివారం జరిగింది. ఇల సాగరం ప్రదీప్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా దుగ్గిల తిరుపతి హాజరై మాట్లాడుతూ...బీజేపీ అధికారంలోకి రాకముందు కేంద్రంలో అధికారంలోకి వస్తే ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని ప్రచారం చేసి యువతను నమ్మించారని, 11 ఏళ్ల పాలనలో 11 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ అని ఆయన ప్రశ్నించారు. తన పాలనలో కనీసం రెండు కోట్ల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు.రైల్వేలో యాక్ట్ అప్రెంటిస్ చేసిన తెలంగాణలో 15 వేల మందికి పైగా అభ్యర్థులు ఉన్నారని, ఏడాది పాటు అన్ని పనులు చేయించుకుని సర్టిఫికెట్ ఇచ్చి పంపించారని అన్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో వీరికి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలాగే, అయోధ్య పురంలో భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఉద్యోగం ఇస్తామన్న హామీని అమలు చేయాలని, స్థానిక నిరుద్యోగుల కోసం ప్రత్యేక రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు పరీక్ష ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యోగాలు సాధించే వరకు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఎం. చుక్కయ్య, ఓరుగంటి సాంబయ్య, కారు ఉపేందర్, జంపాల రమేష్, పాదాసీ రామస్వామి, షేక్ గులాం, లకావత్ హర్షిత్, ఉప్పు వెంకటేష్, పూల మనీకంఠ, కొలుగూరి ప్రవీణ్, రామటంకి కివిష్ణు, రంజిత్, శ్యామలా నాయక్, బండారి రంజిత్, సమ్మెట సాయి త్రిశాల్, నార్లగిరి తనీష్, కొలుగూరి రవికుమార్, ఎండి అల్తాఫ్ పాషా, దీనబోయిన రాము, కామణి శశికుమార్, హరికాంతపు అశోక్, భూ నిర్వాసితులు దుపెల్లి రాజేందర్, వెల్లి షోజు శ్రీనివాస్, తేజ తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ టెక్స్టైల్ పార్క్‌కు కేంద్ర బృందం ప్రశంసలు







**కైటెక్స్, గణేశా ఇండస్ట్రీస్ పనితీరుపై సంతృప్తి..**

**ఉపాధి సృష్టిలో కీలక పాత్ర అని అభినందనలు**

**గీసుగొండ, మే 9 అక్షర సవాల్:** గీసుగొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్లో కేంద్ర టెక్స్టైల్స్ శాఖ ఉన్నతాధికారుల పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. భారత ప్రభుత్వ టెక్స్టైల్స్ మంత్రిత్వ శాఖ సెక్రటరీ నీలం శమి రావు ఆధ్వర్యంలోని ఉన్నతాధికారుల బృందం శుక్రవారం పార్క్‌లోని ప్రముఖ పారిశ్రామిక సంస్థలను సందర్శించి ఉత్పత్తి కార్యకలాపాలను పరిశీలించింది. ఈ పర్యటనలో టిఎస్ఐఐసి ఎండీ శశాంక్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, ఆర్డీవో సుమ, జెడ్ఎం స్వామి, గీసుగొండ తహసీల్దార్ రియాజుద్దీన్, సంగెం తహసీల్దార్ జి. రాజ్ కుమార్ పాల్గొన్నారు. అధికారులు కైటెక్స్ యంగ్ వన్, గణేశా ఇండస్ట్రీస్ సంస్థలను సందర్శించి ఉత్పత్తి సామర్థ్యం, నిర్వహణ విధానం, కార్మిక సంక్షేమ చర్యలు, భద్రతా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించారు. సంస్థల నిర్వహణ తీరు, పారిశ్రామిక ప్రగతి, కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి పరిశ్రమలు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పారిశ్రామిక రంగ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, పెట్టుబడులు ఉపాధి విస్తరణలో ఇలాంటి పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# శ్రీరామ నామాలతో పాదయాత్ర





**మంగపేట, మే 09, అక్షర సవాల్:** హనుమాన్ మాలదార స్వాములు భక్తిశ్రద్ధలతో పరమ పవిత్రమైన శ్రీరామ నామాలను ఉచ్చరిస్తూ పాదయాత్రకు నాంది పలికారు. మండలంలోని కమలాపురం భక్తాంజనేయ స్వామి దేవాలయంలోని హనుమాన్ మాలాదారులు శనివారం తెల్లవారుజామున పాదయాత్రను ప్రారంభించి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి మల్లూరు శ్రీ హేమచల లక్ష్మినర్సింహా స్వామి శికాంజనేయ స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి లింగంపల్లి శ్రీనివాసరావు, స్వాములు యాస నాగేందర్ శ్రీరామ్ అశోక్ ఇల్లందుల చందు లక్ష్మణ్ భక్తులు ఆళ్ల సుధాకర్ గూడూరు రంజిత్ పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల దాతృత్వం ...

**స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం**

**- రూ 41,500 ల ఫిక్స్ డిపాజిట్ అందజేత**

**మంగపేట, మే 09, అక్షర సవాల్:** పూర్వ విద్యార్థుల దాతృత్వంతో సహచర స్నేహితు డి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలన్న సదుద్దేశంతో రూ 41,500 లు స్నేహితుని కుమార్తె పేరున పోస్ట్ ఆఫీస్ లో ఫిక్స్ డిపాజిట్ చేసి పత్రాన్ని పాపారావు భార్యకు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని పొదుమూరు గ్రామానికి చెందిన బద్ది పాపారావు గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మరణించాడు. స్నేహితుడి కుటుంబానికి భరోసా కల్పిస్తూ పూర్వ విద్యార్థులు శనివారం బద్ది పాపారావు కుటుంబాన్ని కలిసి సాయం అందించడమే కాకుండా స్నేహానికి ఉన్న గొప్పతనాన్ని చాటుకున్నారు. స్నేహితుల సేవా భావాన్ని గ్రామస్థులు కొనియాడారు. ఈ



కార్యక్రమంలో విభూది అమరలింగం కంకటి శరత్ కోడం నరేష్ ఈసంపల్లి సురేందర్ చల్ల రాంకీ సాయిని రాము షేక్ అజ్మత్ సోడే భూపతి బొమ్మనపోయిన శివకృష్ణ నరేష్ మిగిలిన మిత్రులు పాల్గొన్నారు.

# ఉద్యమ నేతకు రాష్ట్ర గౌరవం



**తెలుగు అకాడమీ చైర్మన్‌గా కూరపాటి వెంకట్‌నారాయణ**

**రైతు సంఘం నేతల ఘన సన్మానం..**

**విద్యా, ఉద్యమ సేవలను కొనియాడిన నాయకులు**

**వరంగల్, మే 9 అక్షర సవాల్:** తెలంగాణ ఉద్యమ నేత, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణను తెలుగు అకాడమీ రాష్ట్ర చైర్మన్‌గా నియమించడంపై తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, మొక్కను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రొఫెసర్ వెంకట్‌నారాయణ విద్యారంగంలో వేలాది మంది విద్యార్థులను సామాజిక చైతన్యవంతులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. రైతు సంఘం గౌరవ అధ్యక్షుడిగా గ్రామస్థాయిలో రైతులను చైతన్యపరిచి, వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేశారని గుర్తుచేశారు. ఆయన సేవలను గుర్తించి తెలుగు అకాడమీ చైర్మన్ పదవికి ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి రైతు సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు సోమ రామ్మూర్తి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎండి. షేక్ హుస్సేన్, ఎఐకేఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు ఐతం నగేష్, ధర శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని షెడ్యూల్ ఇదే...



**హైదరాబాద్, మే 9:**ప్రధానమంత్రి మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి తెలంగాణ వస్తున్నారు. దీని కోసం తెలంగాణ బీజేపీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ పర్యటన రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కీలకమైన మలుపుగా భావిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత పూర్తి ఉత్సాహంతో ఉన్న భారతీయ జనతా పార్టీ శ్రేణులు, ప్రధాని రాకకు పురస్కరించుకొని భారీ ఏర్పాట్లు చేశాయి. ఈ పర్యటన కేవలం రాజకీయ ప్రాధాన్యత కలిగింది. సుమారు 8వేల కోట్ల విలువైన అభివృద్ధి ఫలాలను తెలంగాణ ప్రజలకు అందించే లక్ష్యంతో సాగుతుంది. ప్రధాని మోదీ ఈ పర్యటనలో భాగంగా వివిధ కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇవి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలను కల్పించే అవకాశం ఉంది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వద్ద 2,360 కోట్లతో అభివృద్ధి చేయనున్న ఈ స్మార్ట్ సిటీకి ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఇది పారిశ్రామిక రంగంలో తెలంగాణకు కొత్త దిశకు చూపించనుంది. 3175 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న గూడెబెల్లూరు మహబూబ్‌నగర్ జాతీయ రహదారి పనులకు కూడా ఆయన శంకుస్థాపన చేయనున్నారు. 611 కోట్లతో మల్లాపూర్ వద్ద ఏర్పాటు చేయనున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్‌కు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. 1243 కోట్లతో పూర్తి చేసిన కాజీపేట-విజయవాడ ట్రిపులింగ్ పనులకు ప్రధాని జాతీకి అంకితం చేస్తారు.వరంగల్ జిల్లలో 200 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ టెక్స్ టైల్ పార్క్ తెలంగాణ చేనేత, వస్త్ర రంగానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావడానికి సహాయపడుతుంది.ప్రధాని మోడీ ఆదివారం మధ్యాహ్నం తెలంగాణకు చేరుకోనున్నారు. ఆయన పర్యటన అత్యంత పకడ్బందీగా సాగేలా అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. మధ్యాహ్నం 2.50 గంటలకు కర్ణాటక నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్ పోర్ట్ చేరుకుంటారు. హెలీకాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3.30 గంటలకు హెచ్ఐసీసీకి చేరుకొని అక్కడ 8000కోట్ల విలువై వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. సాయంత్రం 4.10 నిమిషాలకు హైటెక్ సిటీ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన సింధూ ఆసుపత్రిని ప్రారంభిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. పర్యటన ముగించుకని బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో గుజరాత్‌లో జామ్‌నగర్‌కు బయల్దేరారు. ప్రధాని పర్యటన దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు

## విజయ్ కు సంఖ్యాబలం

# కత్తిమీద సాము...

**చెన్నై, మే 9:**తమిళనాడు రాజకీయాల్లో విజయ్ తన తమిళగ వెట్రి కళగం ద్వారా కోట్లాది మంది అభిమానుల ఆశలను మోస్తూ ముఖ్యమంత్రి పీఠం దిశగా అడుగులు వేశారు. అయితే, ఈ పట్టాభిషేకం పూలబాట కాదు.. ముళ్లబాట . దశాబ్దాల ద్రవిడ రాజకీయాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత క్లిష్టమైన, అస్థిరమైన సమీకరణాల మధ్య విజయ్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. 118 మంది ఎమ్మెల్యేల మద్దతుతో మేజిక్ ఫిగర్‌ను అతి కష్టమ్మీద చేరుకున్న విజయ్ సర్కార్‌కు దినదినగండం.. నూరేళ్ల ఆయుష్షు అన్న సామెత అక్షరాలా సరిపోతుంది.విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి ఉన్న ప్రధాన బలహీనత సంఖ్యాబలం . మ్యాజిక్ ఫిగర్‌కు కేవలం ఒకటి లేదా రెండు స్థానాల దూరంలోనే నిలబడటం అంటే, ఐదేళ్ల కాలం పాటు ప్రతి నిమిషం గండం గడిచినట్లే. ప్రజాస్వామ్యంలో సంఖ్యాబలం ప్రాణవాయువు వంటిది. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు అలిగినా, లేదా అసంతృప్తితో రాజీనామా చేసినా ప్రభుత్వం కుప్పకూలే ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ ఒక స్వతంత్ర అభ్యర్థి లేదా చిన్న పార్టీ నేత కూడా కింగ్ మేకర్ పాత్ర పోషించే అవకాశం ఉండటంతో, వారిని బుజ్జగించడానికే విజయ్ తన శక్తిని ఎక్కువగా ఖర్చు చేయాల్సి ఉంటుంది.

## డాక్టర్ అఖిల - చరణ్ లను

# ఆశీర్వ దించిన ప్రముఖులు...









**హనుమకొండ, అక్షర సవాల్ :** హన్మకొండ హంటర్ రోడ్‌లోని అలకనంద కన్వెన్షన్ హాల్‌లో బిజెపి డోర్నకల్ నియోజకవర్గం, మాజీ జెడ్పిటిసి గుగులోతు దేవిక శంకర్ నాయక్ కుమారుడుడా. చరణ్ చరణ్,బానోత్ అర్పిత లక్ష్మణ్ నాయక్ల కుమార్తె డాక్టర్ అఖిల వివాహం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వివాహ వేడుకలో ప్రముఖులు పాల్గొని ఆశీర్వదించారు ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర నాయకులు రావు పద్మ, ఎడ్ల అశోక్ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీర సీతారాం నాయక్, అడిషనల్ ఏఎస్పీ ఆంగోత్ నరేష్ నాయక్, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ఎన్ నాయక్, జనగాం డీసీపీ రాజమహేంద్ర నాయక్, నందిరాం నాయక్, ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ నాయక్, ప్రొఫెసర్ సురేష్ లాల్, జెడ్పీటీసీ వీరమ్మ గోపి సింగ్ నాయక్, అజ్మీర శ్రీరాం నాయక్, సత్యమ్మ బిక్షపతి నాయక్, సోమ్లా నాయక్, గంగు నాయక్, గోవర్ధన్ నాయక్, రవీందర్ నాయక్, కొర్ర భారతీ ధరమ్ సింగ్ నాయక్, లావుడియా పల్లవి రాజు నాయక్, శ్రావణ్ కుమార్, రమేష్ నాయక్, అజ్మీరా రవి నాయక్, సరిత గణపతి నాయక్, గుగులోతు రాజు నాయక్, రమా నరేష్ నాయక్, కవిత వి.ఎన్ నాయక్, జమ్మూ నాయక్, ఎంపీడీవో జయరాం నాయక్, కరణ్ సింగ్ నాయక్, హరి సింగ్ భారతీయ నాయక్, వీరస్వామి నాయక్, అజ్మీరా రాజు నాయక్, సమ్మయ్య తేజావత్,సునీల్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# మే 10తో ముగియనున్న స్వీయ జనాభా గణన

**ఇంటి నుంచే కుటుంబ వివరాల నమోదు.. ప్రజలు తప్పక వినియోగించుకోవాలి**

**గీసుగొండ తహసీల్దార్ విజ్ఞప్తి**

**ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని పిలుపు**



**గీసుగొండ, మే 9 అక్షర సవాల్:** దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 2027 జనాభా లెక్కల ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ గణన కార్యక్రమానికి గీసుగొండ మండలంలో విశేష స్పందన లభిస్తోంది. ఏప్రిల్ 26 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ మే 10తో ముగియనున్న నేపథ్యంలో మండల ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గీసుగొండ తహసీల్దార్ ప్రత్యేకంగా కోరారు. ప్రజలు తమ కుటుంబ వివరాలను తామే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే విధంగా ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. దీంతో జనాభా గణన ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. స్వీయ గణన కోసం ముందుగా **https://se.census.gov.in** వెబ్‌సైట్‌ను తెరవాలని అధికారులు సూచించారు. అనంతరం స్వీయ గణన ప్రవేశం వద్ద తెలంగాణ రాష్ట్రాన్ని ఎంపిక చేసి చిత్ర సంకేతాన్ని నమోదు చేసి ధృవీకరించి కొనసాగించండి అనే ఎంపికపై నొక్కాలని తెలిపారు. తర్వాత కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నంబర్ నమోదు చేసి ఓటీపీ ద్వారా ధృవీకరణ పూర్తి చేయాల్సి ఉంటుందని వివరించారు. అలాగే జిల్లా, గ్రామం లేదా పట్టణం, పిన్ కోడ్ వివరాలు నమోదు చేసిన అనంతరం మొబైల్‌లో ప్రదేశ గుర్తింపు ప్రారంభించి ఇంటి వద్ద గుర్తు పెట్టాలని పేర్కొన్నారు. ఇళ్ల వివరాలకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి ఒకసారి పరిశీలించిన తర్వాత సమర్పించాలని సూచించారు. సమర్పించిన అనంతరం వచ్చే ఎస్ఈ ఐడీని తప్పనిసరిగా భద్రపరచుకోవాలని తెలిపారు. మే 11 తర్వాత ఇంటికి వచ్చే గణన అధికారికి ఆ ఎస్ఈ ఐడీ చూపిస్తే నమోదు ప్రక్రియ పూర్తి అవుతుందని అధికారులు వెల్లడించారు. "మన బాధ్యత -- మన సమాచారం" అనే నినాదంతో ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా తమ వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ గణన ప్రక్రియకు సహకరించాలని తహసీల్దార్ కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు.

# ఆలయాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ**







**గీసుకొండ, మే 9 అక్షర సవాల్:** వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని రాంపూర్ గ్రామంలో నిర్వహించిన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ మహోత్సవానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ టెంకాయ కొట్టి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. ఆలయాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పరిశుభ్రమైన వాతావరణం ఉన్నప్పుడే భక్తులు భగవంతునిపై సంపూర్ణ భక్తితో మనసును లగ్నం చేయగలరని పేర్కొన్నారు. "పరిశుభ్రత ఉన్న చోటే దైవ కృప ఉంటుంది" అని మంత్రి స్పష్టం చేశారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం వరంగల్ నగరంలోని 19వ డివిజన్ కాశీబుగ్గలో గల శ్రీ సీతారామాంజనేయ హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో నిర్వహించిన హనుమాన్ స్వాముల అన్నదానం (భిక్ష) కార్యక్రమంలో కూడా మంత్రి పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం హనుమాన్ స్వాములకు స్వయంగా భిక్ష వడ్డించి భక్తుల ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలో ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండప నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి కొండా సురేఖ వెల్లడించారు.

# జై రేణుక ఎల్లమ్మ నినాదాలతో మారుమోగిన గ్రామం

**అంగరంగ వైభవంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం**





**ఆత్మకూరు, మే 9 అక్షర సవాల్:** గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. భక్తుల జయజయధ్వానాల మధ్య రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. పూజారి రమేష్ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ రేణుక ఎల్లమ్మ, కంఠమహేశ్వర స్వామి, జమదగ్ని మహర్షి, సురమాంబ, పోతరాజు విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, పూజా కార్యక్రమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ దేవతా విగ్రహాలను ఆలయంలో ప్రతిష్టించి మహామంగళహారతులు సమర్పించారు. ఈ సందర్భంగా "హర హర మహాదేవ శంభో శంకర... జై రేణుక ఎల్లమ్మ... జై జై రేణుక ఎల్లమ్మ" అంటూ భక్తులు చేసిన నినాదాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. మహిళలు బోనాలు, పూజా సామగ్రితో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొని ఆధ్యాత్మిక ఉత్సాహంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, వార్డ్ మెంబర్ తనుగుల సందీప్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పొగాకుల కొమురయ్య, పొగాకుల రమేష్, గుర్రం ప్రభాకర్, వల్లాల రాజు, ఏరుకొండ పైడి, బూర మహేందర్‌తో పాటు భారీ సంఖ్యలో మహిళలు, గౌడ కులస్తులు, గ్రామస్తులు పాల్గొని రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# సీఎం రేవంత్‌కు పొలిటికల్ స్కోరింగ్ తప్ప
# స్టేట్ స్కోరింగ్ లేదు: హరీశ్

**సిద్దిపేట, మే 9:** కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి విమర్శలు గుప్పించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తుమ్మిడిహెట్టి వద్ద కాంగ్రెస్ తీరు చూస్తే పని తక్కువ.. హడావుడి ఎక్కువ అన్నట్టుందని వ్యాఖ్యానించారు. ఆనాడు కిరణ్ కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే 150 మీటర్లకు ఒప్పందం కుదిరిందని మంత్రి వివేక్ చెబుతున్నారని.. మరి అప్పుడే ఎందుకు ప్రాజెక్ట్ కట్టలేదని ప్రశ్నించారు. తమతో ఒప్పందం లేకుండా పని చేస్తే పనులు వృథా అవుతాయని కిరణ్ కుమార్ రెడ్డికి అప్పటి మహారాష్ట్ర సీఎం పృథ్వీరాజ్ చౌహాన్ లేఖ రాశారని గుర్తుచేశారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కడితే ఎల్లంపల్లి వరకు గ్రావిటీ ద్వారా నీళ్లు వస్తాయని మంత్రి జూపల్లి కృష్ణారావు అంటున్నారని.. మరోవైపు తుమ్మిడిహెట్టి నుంచి సుందిళ్లకు నీళ్లు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారన్నారని మాజీ మంత్రి తెలిపారు. ఇంతకీ ఎవరు చెప్పింది కరెక్ట్ అని నిలదీశారు. తెలంగాణ మంత్రులు రాష్ట్ర పరువు తీస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి పొలిటికల్ స్కోరింగ్ తప్ప స్టేట్ స్కోరింగ్ లేదని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే మహారాష్ట్రకు తానే వెళ్లి మాట్లాడినట్లు చెప్పారు. కాంగ్రెస్



ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్ల అయినా మహారాష్ట్రతో మాట్లాడటం లేదని అన్నారు. ఆనాడు కేంద్రంలో, మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నా తుమ్మిడిహెట్టికి ఒప్పించలేదని హరీశ్ విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోని రూ.17 వేల కోట్లు ఉన్న తుమ్మిడిహెట్టి ప్రాజెక్ట్ రూ.40 వేల కోట్లకు చేరిందన్నారు. కాంగ్రెస్ అవినీతి గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అంటేనే కరప్షన్ అని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్ట్‌కు ఇప్పటికే రూ.11 వేల కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం చెబుతున్నారని మాజీ మంత్రి అన్నారు. ఇది జలయజ్ఞం కాదు.. ధనయజ్ఞం అన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు ఊసరవెల్లి లెక్క మాట మారుస్తున్నారని మండిపడ్డారు. 30 నెలల్లో మేడిగడ్డలో మూడు పిల్లర్లను మరమ్మతు చేయడం చేతకాలేదని విమర్శించారు. ఇప్పటికే మేడిగడ్డ వద్ద 6400 క్యూసెక్కుల నీళ్లు కిందకు వెళ్తున్నాయని చెప్పారు. మేడిగడ్డ మరమ్మతు చేస్తే కేసీఆర్‌కు ఎక్కడ పేరు వస్తుందో అని తుమ్మిడిహెడ్డి డ్రామా ఆడుతున్నారని హరీశ్ ఆరోపించారు. ఎల్ నినో కరువు వస్తుందని దేశం అంతా చెబుతోందని.. కరువు కారు చీకటిలో వెలుగు దివ్వె కాళేశ్వరం ప్రాజెక్ట్ అని అన్నారు. కాళేశ్వరాన్ని తక్కువ చేస్తే అక్కడ కొలువైన ముక్తేశ్వరుడు తగిన బుద్ధి చెబుతాడని హెచ్చరించారు. డ్రామాలు కట్టిపెట్టి మేడిగడ్డ మూడు పిల్లర్లు రిపేర్ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో అత్యధికంగా ఎస్సీ ఎస్టీ కేసులు, ఆడపిల్లల మిస్సింగ్ కేసులు తెలంగాణలో నమోదవుతున్నాయని కేంద్రం నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు అన్నారు. ఒకప్పుడు లా అండ్ ఆర్డర్‌లో తెలంగాణ నంబర్ వన్ అని కేంద్రమే అనేక సార్లు చెప్పిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో రాజకీయ వేధింపులకు పోలీసులను వాడుకుంటున్నారన్నారు. హోం మంత్రిగా రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్ అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

# పచ్చళ్ల తయారీకి ధరల ఘాటు..

**జగిత్యాల:** పచ్చడి తయారీకి అవసరమైన ముడి సరుకుల ధరలు పెరగడంతో పేదలకు పచ్చడి మెతుకులు సైతం కరువయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణంగా మామిడికాయ పచ్చడిని మే, జూన్ నెలల్లో ప్రతీ ఇంట్లో తయారు చేసుకుంటుంటారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మామిడి కాయల దిగుబడి గణనీయంగా తగ్గడంతో పాటు కారం పొడి, నూనె, వెల్లుల్లి, జిలకర, ఆవాలు, మెంతులు ఇలా పచ్చడి తయారీకి అవసరమ్యే అన్ని సరుకుల ధరలు పెరిగాయి. దీంతో ఆవకాయ పచ్చడి పెట్టుకోవడాన్ని కొందరు పేద ప్రజలు వదులుకుంటున్నారు.

**పెరిగిన పచ్చడి తయారీ పదార్థాల ధరలు...**

యేటా వేసవిలో పచ్చడి మామిడి కాయలు కిలో రూ.40 నుంచి రూ.60 వరకు ధరలు పలికేవి. ప్రస్తుతం రూ.80 నుంచి రూ.100 వరకు ధరలు పలుకుతున్నాయి. దీనికి తోడు పచ్చడి తయారీకి అవసరమయ్యే వేరుశనగ నూనె, ఎండు మిర్చికారం, మసాల దినుసులు, వెల్లుల్లి ధరలు పెరిగాయి. ఆవాలు గత యేడాది రూ.120 ఉండగా ప్రస్తుతం రూ. 130 ఉంది. వేరు శనగ నూనె కిలో గత యేడాది రూ.250 ఉండగా



ప్రస్తుతం రూ. 300 బ్రాండ్‌ను బట్టి పెరిగింది. వెల్లుల్లి సైతం కిలో ధర ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్య తను బట్టి రూ.260 నుంచి రూ.320 వరకు ఉంది. ఎండు మిరప కాయలు గత యేడాది రూ.250 నుంచి రూ.300 వరకు ఉండగా, ప్రస్తుత యేడాది రూ.500 నుంచి రూ.600 వరకు పెరిగింది. కారం పొడి అయితే కిలో రూ.500 వరకు పలుకుతోంది. పచ్చడి మామిడి కాయలను ముక్కలను చేసేందుకు కిలోకు రూ.20 నుంచి రూ.40 వరకు డిమాండ్‌ను బట్టి తీసుకుంటున్నారు. ప్రస్తుతం లెక్కల ప్రకారం రెండున్నర కిలోల పచ్చడి తయారీకి రూ.400 నుంచి రూ.500 వరకు వ్యయం అవుతోంది. యేటా ఖర్చులు పెరుగుతుండడంతో మామిడి పచ్చడి తయారు చేసుకు నేందుకు పేద, మధ్య తరగతి ప్రజలు ఆసక్తి ని చూపడం లేదు. కాగా కొన్ని కుటుంబాలు గతంలో తయారు చేసుకునే పచ్చడి పరిణామంలో సగం వరకు మాత్రమే తయారు చేసుకుంటున్నారు.

# బీఆర్ఎస్ ఖాళీయే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్

- మొదటి పేజీ తరువాయి

పరిసర ప్రాంతాల్లోని బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, బలమైన కేడర్‌ను ఆకర్షించడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని డిసైడయింది. బీఆర్ఎస్ రాజకీయ ఉనికి ముగిసింది అనే సంకేతాలను ప్రజల్లోకి బలంగా పంపడం ద్వారా, ఆ పార్టీ ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకోవాలని బీజేపీ భావిస్తోంది.బీజేపీ రాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతలుగా ఉన్న ఈటల రాజేందర్ , కేంద్ర మంత్రి బండి సంజయ్ భిన్నమైన వ్యూహాలతో పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ అంతర్గత పరిణామాలు తెలిసిన ఈటల, ఆ పార్టీలోని అసంతృప్త నేతలతో టచ్‌లో ఉంటూ ఆపరేషన్ ఆకర్ష్ ను పర్యవేక్షిస్తుండగా.. బండి సంజయ్ తనదైన శైలిలో హిందూత్వ ఎజెండా, యువతను ఆకట్టుకునేలా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. సంస్థాగతంగా బలంగా ఉన్న ప్రాంతాల్లో పట్టు నిలుపుకుంటూనే, బలహీనంగా ఉన్న దక్షిణ తెలంగాణలో పార్టీని విస్తరించడమే వీరిద్దరి ప్రధాన లక్ష్యం.రాష్ట్రంలో ఇప్పుడు రాజకీయాలు క్రమంగా ద్విపాక్షికంగా మారుతున్నాయి. ఒకప్పుడు బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగా ఉన్న పోరు, ఇప్పుడు కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ గా రూపాంతరం చెందుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బలం, రాష్ట్రంలో పెరుగుతున్న ప్రజాదరణను చూపిస్తూ.. భవిష్యత్తులో కాంగ్రెస్‌ను ఢీకొట్టే ఏకైక శక్తి బీజేపీయేనని నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఉనికిని క్రమంగా దెబ్బతీస్తూ, ఆ పార్టీకి ఉన్న ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని ఆక్రమించేందుకు కమలనాథులు సిద్ధమయ్యారు.బీఆర్ఎస్ నుంచి వలసలు పెరగడం వల్ల ఆ పార్టీ కేడర్ చెల్లాచెదురవుతోంది. గతంలో కాంగ్రెస్‌ను వ్యతిరేకించిన ఓటర్లు ఇప్పుడు బీఆర్ఎస్‌ను



బలహీనంగా భావించి, కమలం వైపు చేరుతారని నమ్ముతున్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు బీజేపీ స్టేట్ ఆఫీస్‌కు రావడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబంతో కలిసి ఢిల్లీలో నరేంద్ర మోదీని కలిశారు. దీంతో బీఆర్ఎస్‌లో ఒక్కసారిగా కలకలం రేగింది. మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబంతో సహా కమలం గూటికి చేరేందుకు రెడీ అయ్యారన్న వార్తలు వస్తున్నాయి. అయితే బీజేపీలో చేరికపై మల్లారెడ్డి కోడలు ప్రీతీరెడ్డి క్లారిటీ ఇచ్చినా..వారి కుటుంబం వేస్తున్న అడుగులు బీజేపీలో చేరేలా ఉన్నాయనే చర్చ నడుస్తోంది. ఇప్పుడు ఇదే అంశం బీఆర్ఎస్‌లోనూ చర్చకు దారి తీసిందంటున్నారు. నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, అల్లుడు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి కొడుకు భద్రారెడ్డి, కోడలు ప్రీతీరెడ్డి బీజేపీలో చేరబోతున్నారా అనే ఊహాగానాలు మొదలయ్యాయి. బీజేపీ నేతలు కూడా ఈ అంశంపై నర్మగర్భంగా స్పందిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.ఇక గ్రేటర్‌లో కీలకంగా ఉన్న కాంగ్రెస్ నేతలే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్‌కు తెర లేపేందుకు సిద్ధమయ్యారట కమలనాథులు. గ్రేటర్ పరిధిలో ఉన్న ఒక్కరిద్దరు కాంగ్రెస్ సీనియర్ నేతలను చేర్చుకునేలా పావులు కదుపుతున్నారట. జీహెచ్ఎంసీ, మల్కాజ్ గిరి కార్పొరేషన్, సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలో పాగా వేసేలా బలమైన నేతలను తమ వైపునకు తిప్పుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారట. నరేంద్ర మోదీ సభ వేదికగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలను బీజేపీలోకి తీసుకోవడం ద్వారా ఆ రెండు పార్టీలకు షాక్ ఇవ్వాలనే ప్లాన్ నడుస్తోందట.మోదీ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న స్టేట్ బీజేపీ లీడర్లు..ఇక మోదీ సభకు ముందు, ఆ తర్వాత అన్నట్టుగా పార్టీ దూకుడు పెంచాలని డిసైడ్ అయ్యారట. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న బలమైన నేతలను, ఆయా పార్టీలో ఉన్న అసంతృప్త నేతలను ఐడెంటిఫై చేసి వారిని దశల వారీగా కమలం గూటికి చేర్చుకోవాలనేది ప్లాన్ అంటున్నారు. మరి మోదీ సభ వేదికగా బీజేపీలో చేరేదెవరో చూడాలి 2028 నాటికి తెలంగాణలో అధికారం చేపట్టడం అసాధ్యం కాదని పార్టీ గట్టి నమ్మకంతో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ పెరుగుతున్న మాట వాస్తవం. పార్లమెంట్ ఫలితాల జోష్‌ను అలాగే కొనసాగించి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తేనే మిషన్ 2028 విజయవంతం అవుతుంది. బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా దెబ్బతీసి, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంలో బీజేపీ ఎంతవరకు సఫలమవుతుందనే దానిపైనే ఆ పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

# పొలిటికల్ గేమ్... షురూ...

- మొదటి పేజీ తరువాయి

విమర్శలు చేస్తున్నారు. లేటెస్ట్ గా తెలంగాణ సర్కార్ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే..కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐకి అప్పగించిన రేవంత్ సర్కార్.. విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలంటూ సీబీఐకి అప్పగించాలని డిసైడ్ అయ్యింది. దీనిపై త్వరలో సీబీఐ డైరెక్టర్‌ను కలిసి విచారణ కోరేందుకు సర్కార్ సిద్ధమవుతుండటం..తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తోంది రేవంత్ సర్కార్. గతంలోనే జస్టిస్ ఎల్.నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో కమిషన్ వేసింది. అయితే విచారణ సమయంలో కమిషన్ ఛైర్మన్ నిబంధనలకు విరుద్ధంగా..పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు కోర్టుకు వెళ్లడంతో..ఆయనను తప్పించి..జస్టిస్ లోకూర్ నేతృత్వంలో విచారణను పూర్తి చేసింది ప్రభుత్వం. ఇక ఇప్పుడు జస్టిస్ లోకూర్ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా సీబీఐ విచారణ కోరాలని సీఎం రేవంత్ రెడ్డి డెసిషన్ తీసుకోవడం పొలిటికల్‌గా చర్చనీయాంశం అవుతోంది.రాజకీయ విశ్లేషణఇప్పటికే రాష్ట్రంలో రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతున్న కాళేశ్వరం కేసును కూడా సీబీఐకి అప్పగిస్తూ అసెంబ్లీ వేదికగా నిర్ణయాన్ని ప్రకటించింది ప్రభుత్వం. అంతేకాదు..రెండు సార్లు కేంద్రానికి లేఖ కూడా రాసింది రేవంత్ సర్కార్. కాళేశ్వరంపై సీబీఐ విచారణ కోరి 10 నెలలు గడుస్తోంది. అయినా... కేంద్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదంటోంది రాష్ట్ర ప్రభుత్వం. అయినప్పటికీ, విద్యుత్ కుంభకోణంపై రేవంత్ మళ్లీ సీబీఐనే ఎంచుకోవడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.సీబీఐ భుజంపై తుపాకి పెట్టి..బీఆర్ఎస్, బీజేపీని టార్గెట్ చేయాలన్నదే రేవంత్ ప్లాన్‌గా కనిపిస్తోంది. కాళేశ్వరంతో పాటు..విద్యుత్ కొనుగోళ్ల కేసులో..కేంద్రం సీబీఐ విచారణకు అంగీకరిస్తే..గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ చిక్కుల్లో పడుతుందని లెక్కలు వేసుకుంటున్నారట. ఒకవేళ సీబీఐ విచారణపై..కేంద్రం స్పందించకపోతే..బీజేపీ–బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం..సీక్రెట్ ఫ్రెండ్ షిప్ ఉందని ప్రజల్లోకి తీసుకెళ్లడమే రేవంత్ అసలు ప్లాన్ అంటున్నారు. దీంతో..ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా..విచారణ జరిగితే బీఆర్ఎస్ ఇరికిపోతుంది..విచారణ జరగకపోతే ప్రజల ముందు బీజేపీని దోషిగా నిలబెట్టొచ్చన్నది రేవంత్ రెడ్డి వ్యూహంగా చెబుతున్నారు. గత సర్కార్ హయాంలో అక్రమాలు, అవినీతి జరిగిందంటూ ఆరోపిస్తూ వస్తున్న రేవంత్ ప్రభుత్వం..సాక్షాధారాలతో ప్రూవ్ చేయాలనే ప్లాన్‌తో ముందుకెళ్తోందట. దీనిలో భాగంగానే..కాళేశ్వరం కమిషన్, జస్టిస్ లోకూర్ కమిషన్ రిపోర్టులను అస్త్రాలుగా మలుచుకుని కేసీఆర్ హయాంలో అక్రమాలు జరిగాయని ఎక్స్‌పోజ్ చేసే స్కెచ్ వేస్తున్నారట. మరింత వ్యూహాత్మకంగా..బాల్‌ను కేంద్రం కోర్టులోకి నెట్టి..బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనన్న ప్రచారాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా వ్యూహాన్ని ఇంప్లిమెంట్ చేస్తున్నారట. కాళేశ్వరం, కరెంట్ కొనుగోళ్లపై సీబీఐ విచారణ జరుగుతుందో..లేక పొలిటికల్ హాట్ టాపిక్‌గానే కొనసాగుతుందో చూడా

# నిప్పులు చెరుగుతున్న సూరీడు...

- మొదటి పేజీ తరువాయి



నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. మే నెల ద్వితీయార్థంలో ఉండాల్సిన వేడి ఇప్పుడే కనిపిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు.ఈ నెల 12వ తేదీ నాటికి ఎండలు పతాక స్థాయికి చేరుతాయని అంచనా. ఉమ్మడి నల్గొండ మరియు ఖమ్మం జిల్లాలు మినహా రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలకు వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలెర్ట్ ఇచ్చింది. దీని అర్థం కేవలం ఎండ మాత్రమే కాదు, తీవ్రమైన వడగాల్పులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరిక. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావడం ప్రాణసంకటంగా మారే అవకాశం ఉంది.

**వైద్యుల సూచనలు -- తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

తీవ్రమైన ఎండల నేపథ్యంలో ఆరోగ్య నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు:నీరు ఎక్కువగా తాగాలి: దాహం వేయకపోయినా తరచూ నీళ్లు తాగుతూ ఉండాలి. ద్రవ పదార్థాలు ముఖ్యంగా కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండవచ్చు.వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించడం శ్రేయస్కరం. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు లేదా టోపీ తప్పనిసరిగా వాడాలి.ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీలు ఎండ వేడికి త్వరగా ప్రభావితం అవుతారు కాబట్టి, వారు మరింత జాగ్రత్తగా ఉండాలి.రాబోయే మూడు నాలుగు రోజుల పాటు వాతావరణం ఇలాగే నిప్పుల కొలిమిలా మారనుంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి కూడా మొదలవ్వడంతో, ఎండల తీవ్రత సామాన్య ప్రజల జీవనగతిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అధికారుల సూచనలు పాటిస్తూ, అప్రమత్తంగా ఉండటమే ప్రస్తుతానికి అత్యుత్తమ మార్గం.

# హైదరాబాద్ లో నీటిగండం..

- మొదటి పేజీ తరువాయి

సుమారు 80 శాతం ప్రాంతాల్లో భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే తక్కువ లోతుకు పడిపోయాయి. దీనివల్ల సాధారణ బోర్ల నుంచి నీరు రావడం కష్టతరంగా మారింది. నగర శివార్లలోని కుత్బుల్లాపూర్ ప్రాంతంలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ఇక్కడ భూగర్భ జలాలు ఏకంగా 32 మీటర్ల (సుమారు 105 అడుగులు) లోతుకు పడిపోయాయి. అంటే ఇక్కడ నీరు దొరకాలంటే భూమిని మరింత లోతుగా తవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేగంగా మారుతున్న గణాంకాలు గతంతో పోలిస్తే ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గే వేగం పెరగడం నిపుణులను ఆశ్చర్యపరుస్తోంది. గత నెల రోజుల్లోనే పలు ప్రాంతాల్లో నీటి మట్టం సగటున 2 మీటర్ల మేర తగ్గడం గమనార్హం. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో భూగర్భంలో నీటి ఒత్తిడి పెరిగి, ఉన్న వనరులు కూడా త్వరగా హరించుకుపోతున్నాయి. దీనివల్ల ట్యాంకర్ల మీద ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. పరిష్కార మార్గాలు నీటి మట్టాలు ఇంత వేగంగా పడిపోవడానికి ప్రధాన కారణాలను అన్వేషించి పరిష్కరించుకోవాలి. నగరంలో విచ్చలవిడిగా సాగుతున్న అపార్ట్‌మెంట్ నిర్మాణాలు, వందలాది బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాలు త్వరగా అయిపోతోంది. భారీ వర్షాలు కురిసినప్పుడు ఆ నీటిని భూమిలోకి ఇంకించే 'రెయిన్ వాటర్ హార్వెస్టింగ్' గుంతలు చాలా చోట్ల పనిచేయకపోవడం లేదా అసలు లేకపోవడం ప్రధాన సమస్య. నీటిని నిల్వ చేసే చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికావడంతో భూగర్భ జలాలు పునరుద్ధరణ కావడం లేదు. హైదరాబాద్‌లోని ఈ పరిస్థితి రాబోయే రోజుల్లో కేప్ టౌన్ వంటి 'డే జీరో' (నీరు పూర్తిగా అయిపోయే రోజు) పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉంది. ప్రతి ఇంటిలో వర్షపు నీటి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం, నీటిని పొదుపుగా వాడుకోవడం ద్వారానే మన నగరాన్ని నీటి సంక్షోభం నుంచి కాపాడుకోగలం.

# కాంగ్రెస్ పార్టీలో పదవుల చిచ్చు...

- మొదటి పేజీ తరువాయి

గందరగోళానికి దారితీస్తోంది. నిజమైన కార్యకర్తల ఆవేదన పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన వారు ఇప్పుడు తమను 'సెకండ్ క్లాస్' సిటిజన్స్‌లా చూస్తున్నారని భావిస్తున్నారు. పదవులన్నీ కేవలం ఒకే వర్గానికి లేదా ఒకే నాయకుడి అనుచరులకే ఎలా ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత పెరగడం, పాత తరం నాయకులను పక్కన పెట్టడం వల్ల పార్టీ అంతర్గత క్రమశిక్షణ దెబ్బతింటోందని విశ్లేషకులు భావిస్తున్నారు. జీవన్ రెడ్డి వంటి ఉద్ధండులే పార్టీని వీడుతున్నారనే వార్తల నేపథ్యంలో, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఈ అసమ్మతిని ఎలా చల్లారుస్తారన్నది ఆసక్తికరంగా మారింది. జిల్లాల్లో పేరుకుపోయిన ఈ అసంతృప్తిని త్వరగా పరిష్కరించకపోతే, అది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# కవితకు తమిళ ఎన్నికల ఊపు..

- మొదటి పేజీ తరువాయి




ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలని, కొత్త తరం నాయకత్వం, విభిన్నమైన రాజకీయ ఆలోచనలు ప్రజల ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలు పాత పద్ధతులతో ఎందుకు విసిగిపోయారని కవిత అన్నారు. కేవలం అధికారమే పరమావధిగా పని చేసే నాయకుల పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని అన్నారు. వారిపై ఉన్న అసహనం కారణంగానే ప్రజలు ప్రత్యామ్నాయ శక్తులవైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. వ్యవస్థలో పేరుకుపోయిన లోపాలను సరిదిద్దాలంటే కొత్త రాజకీయ శక్తులు రావాడం అనివార్యమని అభిప్రాయపడ్డారు.తెలంగాణలో తనదైన ముద్ర రాజకీయ ముద్ర వేయాలని చూస్తున్న కవితకు తమిళనాడు ఎన్నికల ఫలితం ఒక ఆశాకిరణంగా కనిపిస్తున్నాయి. అందుకే రాజకీయ చరిత్రను తిరగరాయాల్సిన సమయం వచ్చిందని ఆమె చేసిన కామెంట్స్ టీఆర్ఎస్ ఆలోచనను స్పష్టం చేస్తున్నాయి. కొత్తగా పార్టీ పెట్టిన తను కొత్త ఆలోచనలతో వస్తున్నానని ప్రజలకు మంచి చేసే తమలాంటి వారిని ప్రజలు ఆదరించాలని చెబుతున్నారు. బీఆర్ఎస్‌తో విభేదించిన కవిత గత నెలలోనే టీఆర్ఎస్ పేరుతో కొత్త పార్టీ పెట్టారు. ఐదు ముఖ్యమైన లక్ష్యాలతో పార్టీ పెట్టినట్టు వెల్లడించారు. వాటి కోసం తాను పోరాడతానని చెప్పుకొచ్చారు. ఇప్పుడు తమిళనాడులో కూడా పార్టీ పెట్టిన రెండేళ్లలోనే ప్రజలకు చేరువైన టీవీకే మాదిరిగానే తాను కూడా ప్రజలు చేరువ అయ్యేందుకు కవిత ప్రయత్నిస్తున్నారు. అందుకే కొత్త తరం ఆలోచనలతో వస్తున్న తమ లాంటి వారికి ప్రజలు ఛాన్స్ ఇవ్వాలని సూచిస్తున్నారు. ఇదే విషయాన్ని తన సోషల్ మీడియా పోస్టు ద్వారా చెప్పుకొచ్చారు.

# డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా పూడూరు గ్రామస్థుల అందోళన

**మేడ్చల్ జిల్లా....**మేడ్చల్ డివిజన్ పరిధిలోని పూడూరులో డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకంగా గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. "డంపింగ్ యార్డ్ వద్దు -- గ్రామ అభివృద్ధి కావాలి" అంటూ గ్రామ ప్రజలు ఐక్యంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు."పూడూరు గ్రామ ఐక్య నిరసన" ఆధ్వర్యంలో మహిళలు, యువకులు, రైతులు సహా గ్రామస్థులంతా కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డంపింగ్ యార్డ్ వల్ల పర్యావరణ కాలుష్యం, ఆరోగ్య సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి అనుకూలమైన ప్రాజెక్టులు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమారుడి పై పోక్సో కేసు..

**తెలంగాణ రాజకీయాల్లో కలకలం**



**హైదరాబాద్:** హైదరాబాద్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి,కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మైనర్ బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఫిర్యాదు ప్రకారం,17 ఏళ్ల మైనర్ బాలికకు మద్యం తాగించి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపించారు. మొయినాబాద్ ప్రాంతంలోని ఫార్మ్ హౌస్‌తో పాటు మరో రెండు ప్రాంతాల్లో ఈ ఘటనలు జరిగినట్లు బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు వివరించినట్లు సమాచారం.ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్ సెక్షన్లు 74, 75తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 11 తీ/ష 12 కింద బండి సాయి భగీరథ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.ప్రస్తుతం పోలీసులు బాధితురాలి వాంగ్మూలం,కాల్ డేటా,డిజిటల్ ఆధారాలు,మెడికల్ సంబంధిత వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం.ఇక బాధితురాలి తల్లిదండ్రులు సంచలన ఆరోపణలు చేస్తున్నారు.తమ కుమార్తెపై మానసిక ఒత్తిడి పెరగడంతో రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అలాగే కేసు నుంచి తప్పించుకునేందుకు తమ కూతురిపైనే తప్పుడు కేసులు పెట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.అయితే ఈ వ్యవహారంపై బండి సంజయ్ వర్గం పూర్తిగా భిన్నమైన వాదన వినిపిస్తోంది. ఇది రాజకీయ ప్రేరేపిత“హనీ ట్రాప్”వ్యవహారమని,తమ వద్ద నుంచి రూ.5 కోట్ల డిమాండ్ చేశారని చెబుతున్నారు.రాజీ ప్రయత్నాల్లో భాగంగా రూ.50 వేల రూపాయలు ఇచ్చినట్లు కూడా ప్రచారం జరుగుతోంది.అయితే“ఎలాంటి తప్పు చేయనప్పుడు డబ్బులు ఎందుకు ఇచ్చారు?అన్న ప్రశ్న ఇప్పుడు సోషల్ మీడియాతో పాటు రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారి తీస్తోంది.ఈ అంశంలో నిజానిజాలు పోలీసు దర్యాప్తులోనే తేలాల్సి ఉంది.ప్రస్తుతం ఈ కేసు రాజకీయంగా కూడా వేడెక్కుతోంది.అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటుండగా,సోషల్ మీడియాలో ఈ వ్యవహారం వైరల్‌గా మారింది.కేసు దర్యాప్తు ఏ మలుపు తిరుగుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## క్రైస్తవులకు శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలి

**పాస్టర్స్ వెల్ఫేర్ అధ్యక్షుడు డాక్టర్ పీటర్**

**హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని క్రైస్తవులకు శ్మశాన వాటికలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎన్నో ఏళ్ళుగా శ్మశాన వాటికలకు స్థలం కేటాయింపు పెండింగ్లో ఉందని సీఎం రేవంత్రెడ్డి పట్టించుకోవాలని ఖైరతాబాద్ పాస్టర్స్ ఫెల్లోషిప్ అధ్యక్షుడు డాక్టర్ బి. పీటర్ అన్నారు. శనివారం ఫిలింనగర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో చర్చిల నిర్మాణానికి, పునరుద్ధరణకు నిధులు వస్తున్నాయని, క్రైస్తవ మహిళలకు కుట్టుమిషన్లు కూడా ఇచ్చారని, ప్రతియేటా ఓవర్సీస్ స్టడీస్ కోసం 100 మంది విద్యార్థులకు ’ 20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నారని ఇది ఎంతో సంతోషించే విషయమని అదే విధంగా క్రైస్తవులు చనిపోయినప్పుడు ఎన్నో బాధలు పడుతున్నారని ఈ విషయాన్ని తాము ఎన్నోసార్లు గత ప్రభుత్వాలకు చెప్పినా పట్టించుకోలేదని రేవంత్రెడ్డి క్రైస్తవుల బాధను అర్థం చేసుకొని క్రైస్తవులకు శ్మశాన వాటికలకు స్థలాలను కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న క్రైస్తవులకు శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని అవసరం ఎంతో ఉందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ ఫోరం అధ్యక్షులు ఆంథోని దాస్, థామస్, వీలియం, టి. ప్రభుదాస్, జీవన్, రవిపాల్, అనిల్కుమార్, సంపత్ మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

## తన నివాసంలో నిరాహారదీక్షను ప్రారంభించిన వి.హనుమంతరావు

**బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ వీహెచ్ నిరాహారదీక్ష**

**బీసీల అభ్యున్నతి జరగాలంటే.. వారి జనాభా ఎంత ఉందో తెలియాలన్న వీహెచ్**

**తన లేఖలకు కేంద్రం నుంచి స్పందన రాకపోవడంతో దీక్షకు దిగిన వీహెచ్**



తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆమరణ నిరాహారదీక్షను ప్రారంభించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన దీక్షకు దిగారు. బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆయన దీక్షను ప్రారంభించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీల అభ్యున్నతి జరగాలంటే, ముందుగా వారి జనాభా ఎంత ఉందో స్పష్టంగా తెలియాలని వీహెచ్ వాదిస్తున్నారు. జనగణనలో బీసీ కులాలను కూడా లెక్కించడం ద్వారానే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన న్యాయం జరుగుతుందని చెబుతున్నారు. మే 8వ తేదీ లోపు ఈ విషయంలో స్పష్టత ఇచ్చిన తర్వాతే ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్‌కు రావాలని వీహెచ్ గతంలోనే అల్టిమేటం ఇచ్చారు. ఈ లోపు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం, తాను రాసిన లేఖలకు జవాబు లేకపోవడంతో ఆయన ఈరోజు దీక్షను ప్రారంభించారు. కేవలం బీసీల హక్కుల కోసమే ఈ పోరాటమని ఆయన స్పష్టం చేశారు.

## కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులు మాకు తెలియదు

**రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల:**

**బండి సంజయ్ కుమార్**

**హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అహంకారంవల్లే ఆయన తండ్రి కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమయ్యారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. కేటీఆర్‌ను చూసి బీఆర్ ఎస్ కార్యకర్తలే అసహ్యించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ప్రధాని రాక సందర్భంగా బండి నేతృత్వంలో ఆర్టీసీ ఎక్స్‌రోడ్ నుంచి అమీర్‌పేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కేటీఆర్ మాదిరిగా దోచుకోవడం నాకు తెలియదు. రైతులకు బేడీలు వేసి అరిగోస పెట్టడం నాకు తెలియదు..డ్రగ్స్ తీసుకోవడం నాకు తెలియదు..కాళేశ్వరం, ఈ-ఫార్ములా, విద్యుత్ కొనుగోళ్ల అవినీతి మాకు తెలియదు..ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులు మాకు తెలియదు, మంది కొంపలు ముంచడం అసలే తెలియదు, ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకునేలా చేయడం మాకు తెలియదు, మాకు ఏం తెలుసో ప్రజలు నిర్ణయిస్తారు. మీకు ఏం తెలుసో ప్రజలు గ్రహించి మిమ్మల్ని ఓడించారు అని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేటీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అహంకారం చూపించి, ఇప్పుడు అధికారం పోయాక కార్యకర్తల ఇళ్లకు వెళ్లి కాళ్లు మొక్కుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ఏం చేసినా రాష్ట్రంలో ఇక అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి తాము నిధులు తెస్తుంటే కాంగ్రెస్ నేతలు తెలంగాణ సొమ్మును ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు పంపుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నోటి దురుసుతనమే తమ పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి కారణమని బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్ అన్నారు.

# ఫీజురీయింబర్స్‌మెంట్‌కు కొత్త రూల్

**హైదరాబాద్, మే 9:** తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌లో పేరు సరిపోలాలి.. లేదంటే దరఖాస్తు ముందుకెళ్లదు. ఈ మేరకు ఫీజుల చెల్లింపు కొత్త విధానంలో తెలంగాణ ప్రభుత్వం సంస్కరణను తీసుకొచ్చింది. తాజా నిర్ణయంతో దాదాపు 20శాతం మంది ఆధార్‌లో మార్పులు చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఒకవేళ తప్పులు ఉంటే ఈ వేసవి సెలవులు ముగిసే లోపు సరి చేసుకోవాలని సూచిస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియలో కీలక సంస్కరణను తీసుకొచ్చారు. రాష్ట్రంలో విద్యార్థులు ట్యూషన్ ఫీజ్, స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో.. పదోతరగతి మెమోలో ఉన్న పేరు.. ఆధార్‌లోని పేరు, ఇంటిపేరు ఒకేలా ఉండాలని ప్రభుత్వం తెలిపింది. ఒకవేళ ఈ రెండు సరిపోలకపోతే విద్యార్థి దరఖాస్తు ప్రాసెస్ చేయరు.. అక్కడే ఆగిపోతోంది. ఈ మేరకు విద్యార్థులు పదో తరగతి హాల్‌టికెట్ నంబర్,డేట్ ఆఫ్ బర్త్ (పుట్టినతేదీ), ఏ సంవత్సరంలో పదోతరగతి పూర్తయ్యింది వంటి వివరాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులకు సంబంధించి ఈ వివరాలన్నీ సరిపోలితేనే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం వస్తుంది.విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో కులం, ఉపకులం, ఆధార్



నంబరు, విద్యార్థి మొబైల్ నంబరు, యూనివర్సిటీ, జిల్లా, మండలం, కాలేజీ పేరు కూడా నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాల్లో పదోతరగతి మెమోలో, ఆధార్‌లో పేరు సరిపోలితేనే దరఖాస్తు ప్రాసెస్ ప్రారంభమవుతుంది. ఇలా విద్యార్థి దరఖాస్తు చేసుకున్న తర్వాత ఓ ఐడీ వస్తుంది.. అప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తు తొలివిడత పూర్తవుతుంది. అలాగే రెన్యువల్ విద్యార్థుల ఆధార్, పదోతరగతి పేరు సరిపోలాల్సిందే అంటున్నారు అధికారులు. తొలివిడతలో దరఖాస్తు పూర్తిచేసిన విద్యార్థులు మీసేవ కేంద్రాల్లో ఆధార్ ఆథెంటికేషన్ ప్రాసెస్ పూర్తిచేయాలి. అనంతరం విద్యార్థులు దరఖాస్తులో వివరాలు పూర్తిచేసి, ఆన్‌లైన్లో సమర్పించాల్సి ఉంటుంది.ప్రతి ఏటా రాష్ట్రంలో ట్యూషన్ ఫీజుల కోసం ఏటా 12 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరందరికి ప్రభుత్వం రూ.2400 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు గతంలో ఆధార్ ధ్రువీకరణ చేస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరయ్యేది. తెలంగాణలో జాతీయ ఉపకార వేతనాల విధానం ప్రకారం ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఎస్సీ విద్యార్థులకు చెల్లిస్తున్నట్లుగా ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులకు వారి వ్యక్తిగత బ్యాంకు అకౌంట్‌లలో నేరుగా ట్యూషన్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లు జమచేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.కొత్త విధానం ప్రకారం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలంటే దాదాపు 20 శాతం మంది ఆధార్‌లో పేరు సవరించుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఈ వేసవి సెలవులు ముగిసేలోగా.. ఆధార్‌లో పేర్కొన్న పేరు, ఇంటిపేరులో ఏమైనా తప్పులు ఉంటే సరిచేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమయ్యే నాటికి దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. అంతేకాదు తప్పనిసరిగా ఆధార్ మొబైల్ అనుసంధానం చేసుకోవాలి. ఆధార్ లింక్ చేసి ఉన్న బ్యాంక్ అకౌంట్ కూడా ఉండాలి. విద్యార్థి బ్యాంక్ అకౌంట్‌లో వివరాలు, ఆధార్ నంబర్ తనిఖీ తర్వాతే ఫీజులు మంజూరు చేస్తారు. మంజూరవుతాయి.

# ఆగస్ట్ నుంచి మూసీ ప్రాజెక్టు పనులు ప్రారంభం

**హైదరాబాద్, మే 9:** మూసీ నది సుందరీకరణకు ముహూర్తం ఖరారైంది. ఈ ఏడాది ఆగస్ట్ నుంచి మూసీ ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయి.మూసీ ప్రాజెక్టుపై చర్చించేందుకు కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమైంది. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ వివరాలను అధికారులు మంత్రులకు అందజేశారు. ఈ నేపథ్యంలో తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఆగస్ట్ నుంచి పనులు ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.మూసీ నది సుందరీకరణ దిశగా అడుగులు పడుతున్నాయి. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టు నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమై వివిధ అంశాలపై చర్చించింది. ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ పరిశీలించింది. ఈ నేపథ్యంలోనే తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. తొలి దశ పనులకు సంబంధించి ఏషియన్



డెవలప్‌మెంట్ బ్యాంకుతో చర్చలు ముగిసినట్లు అధికారులు మంత్రులకు తెలియజేశారు.మరోవైపు ప్రాజెక్టు తొలిదశలో నిర్మాణాలపై ప్రభావం లేని ఐదు కిలోమీటర్ల మేరకు పనులు ప్రారంభించాలని కేబినెట్ సబ్ కమిటీ అధికారులను ఆదేశించింది. నిర్మాణాలపై తక్కువగా ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని కేబినెట్ సబ్ కమిటీ సూచించింది.మరోవైపు ఆగస్టు నెల నుంచి పనులను ప్రారంభించి.. 2027 డిసెంబర్ నాటికల్లా పూర్తిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు ప్రజా భాగస్వామ్యంతోనే అమలు చేస్తామని మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, వారి ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండాప్రాజెక్టును రూపొందించాలని అధికారులకు స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రాజెక్టు అలైన్‌మెంట్‌లో మార్పులు చేసి నిర్మాణాలపై ప్రభావం తగ్గించేలా చూడాలని అధికారులకు స్పష్టం చేసింది.మరోవైపు మొత్తం55 కిలోమీటర్ల మేరకు మూసీ ప్రాజెక్టును చేపడుతున్నారు. 5 దశల్లో ఈ ప్రాజెక్టు పనులు జరగనున్నాయి. తొలి దశలో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌ల నుంచి బాపుఘాట్ వరకూ పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ప్రాజెక్టులో భాగంగా మూసీ నదిలోని చెత్తను తొలగిస్తారు. రివర్ బెడ్ ప్రొఫైలింగ్ చేపడతారు. రిటైనింగ్ వాల్స్, రెండు వైపులా రహదారులు, మురుగు కాలువలు, బ్యారేజీలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి వంటి పనులు చేపడతారు.డిసెంబర్ 2027 నాటికల్లా ప్రాజెక్టును పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతోంది

## కటిక చీకట్లో కారు దీపం లాంటిది కాళేశ్వరం ప్రాజెక్టు

**కాళేశ్వరాన్ని కించపరిస్తే, ముక్తేశ్వరుడి శిక్ష తప్పదు: తస్మాత్ జాగ్రత్త..**

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట:** మేడిగడ్డ మరమ్మతులు చేతగాక, తమ్మిడిహట్టి వద్ద కాంగ్రెస్ డ్రామాలు.150 మీటర్లకు ఒప్పందం జరిగితే కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో తట్టెడు మట్టైనా ఎందుకు తీయలేదు, కాంగ్రెస్ మంత్రులకు ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదు..ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడుతున్నారు.పక్క రాష్ట్రాలకు బహిరంగ లేఖలు రాస్తూ రెచ్చగొట్టడం మానేసి, కేసీఆర్ లా ఆ రాష్ట్రాలను మెప్పించి తెలంగాణ ప్రయోజనాలు సాధించడం నేర్చుకోండి.ఎల్ నినో ముప్పుతో రాబోయే కరువును ఎదుర్కోవాలంటే, తక్షణమే మేడిగడ్డ పిల్లర్లకు రిపేర్లు చేసి రైతాంగానికి సాగునీరు అందించాలి.బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్. తమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని, బీఆర్ఎస్ పై చేస్తున్న దుష్ప్రచారాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ వద్ద కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయకుండా రాష్ట్ర ప్రయోజనాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం గాలికి వదిలేసిందని, వచ్చే ఏడాది రాబోయే కరువును ఎదుర్కోవాలంటే మేడిగడ్డ రిపేర్లు వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**మాజీ మంత్రి హరీశ్ రావు కామెంట్స్:**

ఆదిలాబాద్ జిల్లా తమ్మిడిహట్టి వద్ద కాంగ్రెస్ మంత్రుల



హడావిడి చూసిన తర్వాత ఒక విషయం అర్థమవుతోంది..పని తక్కువ ప్రచారం ఎక్కువ. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు వాగుడు తప్ప చేతలు శూన్యం.ఎల్ నినో ప్రభావంతో కరువు వస్తుందని తెలిసినప్పుడు హడావిడిగా బాయి తవ్వినట్లు కాకుండా, ముందస్తుగా మేడిగడ్డ రిపేర్లు చేయాలి. కానీ దాన్ని వదిలేసి తమ్మిడిహట్టి కడుతున్నట్లు పేపర్లకు ఫోజులిస్తున్నారు. కురచ బుద్ధితో బీఆర్ఎస్ పై బురద జల్లే కార్యక్రమం తప్ప వారు చేస్తున్నది శూన్యం.150 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి ఒప్పందం జరిగిందని మంత్రి వివేక్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. ఒక మంత్రి హోదాలో ఉండి ప్రజలు ఏమనుకుంటారన్న సోయి లేకుండా ఇంత పిచ్చి అబద్ధం మాట్లాడొచ్చా.నిజంగానే ఒప్పందం ఉంటే, ఉమ్మడి రాష్ట్రంలో ఏడున్నరేండ్లు అధికారంలో ఉండి కూడా తట్టెడు మట్టైనా ఎందుకు తవ్వలేదు.

## సైబర్ నేరాల్లో హైదరాబాద్ టాప్

**హైదరాబాద్, మే 9:** దేశంలోని ప్రధాన నగరాలతో పోటీపడుతూ హైదరాబాద్‌లో నేరాల రేటు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో **(NCRB)** విడుదల చేసిన 2024 నివేదిక ప్రకారం, నగరంలో ఆర్థిక నేరాలు, సైబర్ మోసాలు , చిన్నారులపై జరుగుతున్న అరాచకాలు పెరిగాయి.తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం, ఆన్‌లైన్ గేమింగ్, , వ్యసనాల కారణంగా చిన్నారులు నేరాల బాట పడుతున్నారు. ముఖ్యంగా 12-14 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలు చిన్న చిన్న దొంగతనాల నుండి హత్యలు, అరాచకాల వరకు పాల్పడుతుండటం గమనార్హం. 2023లో చట్టంతో విభేదించిన బాలల కేసులు 180 నమోదు కాగా, 2024 నాటికి ఆ సంఖ్య 316కు చేరింది.ఆర్థిక నేరాల విషయంలో ముంబై తర్వాత హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయనే ఆశతో సామాన్యులు సైబర్ మాయగాళ్ల చేతిలో చిక్కి కోట్లాది రూపాయలు నష్టపోతున్నారు. సైబర్ నేరాల్లో నగరం దేశంలోనే మూడో స్థానంలో ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.నగరంలోని బహిరంగ ప్రదేశాలు, రద్దీ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులపై వేధింపులు అధికమవుతున్నాయి. 2024లో నగరంలో 149 లైంగిక వేధింపుల కేసులు, 358 అత్యాచార కేసులు నమోదయ్యాయి. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తల వ్యాప్తిలో కూడా హైదరాబాద్ దేశంలోనే తొలి స్థానంలో నిలవడం గమనార్హం.నేరాలు భారీగా నమోదవుతున్నప్పటికీ, వాటిపై ఛార్జిషీట్లు దాఖలు చేయడంలో మాత్రం జాప్యం జరుగుతోందని నివేదిక పేర్కొంది. 2024లో నమోదైన మొత్తం నేరాల్లో కేవలం 56.9 శాతం కేసుల్లోనే ఛార్జిషీట్లు దాఖలయ్యాయి. పెరుగుతున్న ఈ నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## రెచ్చిపోతున్న మట్టి, మద్యం మాఫియాలు

**మర్కాపురం:** మార్కాపురం జిల్లాలో మట్టి, మద్యం మాఫియా రెచ్చిపోతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా ఆరోపించారు.మార్కాపురం ప్రెస్ క్లబ్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మద్యం బెల్ట్ షాపులు విచ్చలవిడిగా సాగుతున్నా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అలాగే, మైనింగ్ శాఖ అధికారులు అక్రమ మట్టి తరలింపును పట్టించుకోవడం లేదని, అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని విమర్శించారు.

## మాజీ మంత్రి గంగుల కమలాకర్ హౌస్ అరెస్ట్



**కరీంనగర్:** కరీంనగర్లో రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అనుచరులు కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి నేపథ్యంలో నేడు కరీంనగర్ బంద్కు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ బంద్లో పాల్గొనకుండా ఉండేందుకు ముందస్తు చర్యగా గంగుల కమలాకర్ నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఆయనను ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా నిరోధించారు. అదే సమయంలో పలువురు నాయకులు, కార్పొరేటర్లను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీంతో నగరంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులతో గంగుల వాగ్వాదనికి దిగడంతో పోలీసులు అయన ను అరెస్టు చేసి తరలించారు.

## దొంగలను చితకబాదిన స్థానికులు

**కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దొంగతనానికి ప్రయత్నించిన ఇద్దరు దొంగలను స్థానికులు చితకబాదారు. దొంగలను రోడ్డు మీద పడేసి కొట్టారు. జిల్లా కేంద్రంలోని ఫారెస్టు కార్యాలయం దగ్గర ఘటన జరిగింది. ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో దొంగతనానికి ఇంట్లోకి చొరబడ్డారు. వారిని గమనించి ఇంటి ఓనర్ భయంతో కేకలు వేసారు. స్పందించిన స్థానికులు ఇద్దరిని పట్టుకుని దేహశుద్ధి చేసారు. తరువాత పోలీసులకు అప్పగించారు.

# హీరోల యాటిట్యూడ్‌పై వ్యాఖ్యలు.. అల్లు అర్జున్‌ని కాదంటూ రవిబాబు క్లారిటీ



ఘజఱ దీఘఎబ । తెలుగు చిత్ర పరిశ్రమలో తనదైన శైలితో ప్రత్యేక గుర్తింపు పొందిన దర్శకుడు రవిబాబు మరోసారి వార్తల్లో నిలిచారు. కథ ఏదైనా సరే దానికి వినూత్న ట్రీట్‌మెంట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత. దర్శకుడిగానే కాకుండా నటుడిగా, నిర్మాతగా కూడా తన ముద్ర వేసిన రవిబాబు.. తాజాగా 'రేజర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.రేజర్ మే 8న విడుదలకు సిద్ధమవుతుండగా, ప్రమోషన్లలో భాగంగా ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. గతంలో ఒక ఇంటర్వ్యూలో రవిబాబు మాట్లాడుతూ, "ఒక్క హిట్ వచ్చినా హీరోల బాడీ లాంగ్వేజ్ మారిపోతుంది. కళ్లజోడు పెట్టుకుని బిల్డప్పులు కొడతారు" అని వ్యాఖ్యానించారు. వ్యాఖ్యలు నేరుగా అల్లు అర్జున్‌ని ఉద్దేశించి చేసినవేనని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ముఖ్యంగా పుష్ప 2: ది రూల్తో భారీ క్రేజ్ సంపాదించిన అల్లు అర్జున్ ప్రవర్తనను ఉద్దేశించారని నెటిజన్లు అభిప్రాయపడ్డారు. ఈ వివాదంపై తాజాగా స్పందించిన రవిబాబు, తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు.నేను సోషల్ మీడియాలో లేను. నేను ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయలేదు. బన్నీ నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. ఇండస్ట్రీలో సాధారణంగా జరుగుతున్న విషయాలపై మాత్రమే మాట్లాడాను అని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో జరుగుతున్న నెగెటివ్ ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. అల్లు అర్జున్ 'పుష్ప 2' ప్రమోషన్ల సమయంలో ఆయన ప్రవర్తనపై సోషల్ మీడియాలో పలు చర్చలు జరిగాయి. 'తగ్గేదేలే' అనే పాత్ర యాటిట్యూడ్‌ను బయట కూడా చూపిస్తున్నారని, కొంతమంది అది అహంకారంగా కనిపిస్తోందని విమర్శించారు.ముంబైలో జరిగిన ప్రెస్ మీట్లలో ఆయన బాడీ లాంగ్వేజ్, సమాధానాల తీరు కూడా ట్రోలింగ్‌కు గురైంది. అలాగే ఆయనను కలవాలంటే కఠిన ప్రోటోకాల్ పాటించాలన్న వార్తలు కూడా వైరల్ అయ్యాయి.వివాదాల్ని పక్కనబెడితే, రవిబాబు ప్రస్తుతం రేజర్ ప్రమోషన్లలో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం ఒక సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కింది.అడవి నేపథ్యంలో జరిగే ఈ కథలో, మనుషుల కంటే జంతువులే ఎక్కువ వివేకంతో ప్రవర్తిస్తాయనే కాన్సెప్ట్‌ను చూపించనున్నారు. ముఖ్యంగా సినిమాలో కనిపించే కుక్క పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ చిత్రానికి వైదీ సంగీతం అందించగా, 'ఫ్లయింగ్ ఫ్రాగ్స్' బ్యానర్‌పై రవిబాబు స్వయంగా నిర్మించారు. విజువల్ ఎఫెక్ట్స్, సౌండ్ డిజైన్ కూడా హైలైట్‌గా ఉండనున్నాయి.



## సెయాన్' మూవీలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే డివైన్ ఫస్ట్ లుక్

వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో, కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న 'సెయాన్' కోసం చేతులు కలిపారు. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన అమరన్ తర్వాత శివకార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌తో కొలాబరేట్ కావడం విశేషం. విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాన్ని అందుకున్న ఆ చిత్రంతో ఏర్పడిన క్రియేటివ్ జర్నీ ఇప్పుడు మరింత బలపడింది.

గ్రాండ్ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరోయిన్ గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్.. ట్రెడిషన్, డివైన్ వైబ్ మేళవింపుగా ఆకట్టుకుంటోంది. గాజుల షాప్ బ్యాక్‌డ్రాప్‌లో ఆమె కనిపించిన తీరు పాత్రలోని ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. మురుగన్ స్వామి ప్రతీకను గుర్తు చేస్తూ ఆమె కూర్చున్న తీరు మరింత ఆసక్తిని పెంచింది.

రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, శివకార్తికేయన్, ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ కలిసి పనిచేస్తున్న తొలి సినిమా కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేకగా నిలిచింది. తన ప్రత్యేకమైన మ్యూజికల్ స్టైల్‌తో, చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్‌తో పేరుగాంచిన సంతోష్ నారాయణన్ సంగీతం ఈ చిత్రానికి స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది.

రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ లెగసీ, టర్మరిక్ మీడియా విజన్ కలిసిన "సెయాన్" 2026లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాలలో ఒకటిగా నిలవనుంది. తారాగణం: శివకార్తికేయన్, భాగ్యశ్రీ బోర్సే


## మళ్లీ బాలయ్యతో జతకట్టబోతున్న విద్యాబాలన్.. కొరటాల శివ సినిమాలో పవర్‌ఫుల్ రోల్!



నందమూరి బాలకృష్ణ మరియు స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ చీదీఖ 112 గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో ఒక కీలకమైన మరియు పవర్‌ఫుల్ పాత్ర కోసం బాలీవుడ్ నటి విద్యాబాలన్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. గతంలో 'ఎన్టీఆర్ బయోపిక్' (కథానాయకుడు, మహానాయకుడు) చిత్రాలలో బసవతారకం పాత్రలో బాలయ్య సరసన మెరిసిన విద్యాబాలన్, దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత మళ్లీ ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటం విశేషం. ఈ సినిమాలో మాఫియా నేపథ్యంలో సాగే ఒక హై-వోల్టేజ్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉంటుందని, అందులో బాలయ్య 'ఊరమాస్' అవతారంలో కనిపిస్తారని సమాచారం. ఆ ఎపిసోడ్‌లో ఆయనకు జోడీగా విద్యాబాలన్ పాత్ర అత్యంత కీలకంగా ఉంటుందని టాక్. యువసుధ ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తుండగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్ పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఆగస్టులో షూటింగ్ ప్రారంభించి, 2027 సంక్రాంతి కానుకగా ఈ సినిమాను విడుదల చేసేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.

## 'అమరం' మూవీ ఇంటెన్స్ యాక్షన్ ప్యాక్డ్ టీజర్ రిలీజ్

తేజేష్ రాజన్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం అమరం, తిరుఅరుల్ కృష్ణన్ దర్శకత్వం దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. ఇంటెన్స్ యాక్షన్ తో టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఓ ట్రైబల్ స్మగ్లర్, కిల్లర్, ఓ యువతి ప్రయాణం చుట్టూ తిరిగే కథ ఇది. ఎర్రచందనం స్మగ్లర్ల జీవనశైలి, వారు ఎదుర్కొనే కష్టాలు, ప్రమాదాలు, వారి ప్రపంచంలో దాగి ఉన్న వాస్తవాలను కూడా బలంగా ప్రతిబింబిస్తుంది. ఈస్టర్న్ ఘాట్స్ నేపథ్యంగా తెరకెక్కిన ఈ సినిమా అక్కడి సామాజిక సమస్యలను కూడా బలంగా ప్రజెంట్ చేస్తోంది.వెస్టర్న్ ఘాట్స్‌లో కూడా కీలక సన్నివేశాలను చిత్రీకరించగా, కడప పరిసర ప్రాంతాల్లో భారీ సెట్స్ నిర్మించారు. దాదాపు 200 మందికి పైగా పాల్గొన్న ప్రత్యేక యాక్షన్ బ్లాక్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. బాంబేకు చెందిన మార్షల్ ఆర్ట్స్ టీమ్ సహకారంతో మాస్టర్ మిరాకిల్ మైఖేల్ ఆధ్వర్యంలో మూడు భారీ యాక్షన్ బ్లాక్స్ తెరకెక్కించారు. లోతైన ప్రేమకథను సిట్యువేషనల్ యాక్షన్‌తో మేళవించి చిత్రాన్ని రూపొందించారు. తేజేష్ తొలి సినిమాకే అద్భుతమైన యాక్షన్ బ్లాక్స్‌లో నటించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా కొడైకెనాల్‌లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం డాల్ఫిన్ నోస్ వద్ద తెరకెక్కించిన ఒక కీలక సన్నివేశాన్ని ఆయన సింగిల్ టేక్‌లో పూర్తి చేయడం విశేషం. హీరోయిన్‌గా ఐరా అగర్వాల్ నటించగా, నాగినీడు, సాయి ధీనా, జార్జ్ మరియన్, సురేష్ చంద్ర మీనన్, హరీష్ పరాడి తదితరులు కీలక పాత్రలు పోషించారు.ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన తిరువరుల్ కృష్ణన్ గతంలో నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ వద్ద అసోసియేట్‌గా పనిచేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ సంగీతం అందించగా, 'వడచెన్నై', 'అసురన్' చిత్రాలకు ఎడిటింగ్ చేసిన రామర్ ఎడిటర్‌గా వ్యవహరించారు. కొత్త సినిమాటోగ్రాఫర్ భరత్ విజువల్స్ అందించారు.ఈ చిత్రంలో ఐదు పాటలు ఉండగా, వాటికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బూపతి మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు. ఆయన రాజు సుందరం, ప్రభుదేవా మాస్టర్లకు సన్నిహిత సహాయ కుడిగా మంచి గుర్తింపు పొందారు. కొడైకెనాల్‌లో ఆర్ట్ డైరెక్టర్ జనా సర్ రూపొందించిన భారీ సెట్‌లో ఓ ప్రత్యేక ఫోక్ సాంగ్‌ను చిత్రీకరించారు. ఈ పాటలో కేరళకు చెందిన 60 మంది డ్యాన్సర్లు పాల్గొనడం విశేషం. మిక్కీ జే మేయర్ అందించిన ఈ ఫోక్ నెంబర్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వేర్వేరు సామాజిక వర్గాల నుంచి వచ్చిన ఓ జంట అనుకోని పరిస్థితుల్లో చేసే ప్రయాణం, ఆ ప్రయాణంలో ఎదురయ్యే సంఘటనలతో సినిమా ఉత్కంఠభరితంగా సాగనుంది.



## 'సతీ లీలావతి'లో డైరెక్టర్‌గా కనిపిస్తా.. ఆ సినిమాతో పోల్చొద్దు : లావణ్య త్రిపాఠి



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ లావణ్య త్రిపాఠి ఈ బ్యూటీ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం సతీలీలావతి భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్ (శివ మనసులో శృతి) సినిమాలను తెరకెక్కించిన తాతినేని సత్య దర్శకత్వం ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మే 8న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా చేసిన చిట్‌చాట్‌లో ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది లావణ్య త్రిపాఠి. సతీ లీలావతి సినిమాను ఇప్పటికే చూశా. చాలా బాగుంది. సినిమాపై నాకు చాలా నమ్మకముంది. ప్రేక్షకులు ఎలాంటి ఫలితాన్నిస్తారో చూడాలంది లావణ్య త్రిపాఠి. సినిమా షూటింగ్ టైంలో నేను ప్రెగ్నెంట్ అని తెలిసిందే. కానీ మా టీం ఇచ్చిన సపోర్ట్‌తో సులభంగా షూటింగ్ పూర్తి చేశాను. ప్రతీ రోజూ షూటింగ్ పూర్తయ్యాక ఆస్పత్రికి వెళ్లి చెకప్ చేసుకుంటూ ఉండేదాన్ని. షూట్‌లో చిన్న చిన్న గాయాలవడం సాధారణంగా జరిగేదే కదా. ఈ కథ విన్నప్పుడు వరుణ్‌కు చెప్పాను. అప్పుడు ప్రెగ్నెంట్ అని నాకు తెలియదు. ఎలాంటి లక్షణాలు కూడా లేవు. షూటింగ్ కూడా అంత సులభమేం కాదని నాకు అర్థమైంది. ఈ సినిమా కోసం బరువు కూడా తగ్గాను. కానీ నాకు ఈ శక్తి ఎక్కడినుంచి వచ్చిందో తెలియదు. ఇక నుంచి ప్రెగ్నెంట్ అని తెలిస్తే మాత్రం షూటింగ్స్‌కు బ్రేక్ ఇస్తానంటూ చెప్పుకొచ్చింది. సతీలీలావతిలో తాను డైరెక్టర్ రోల్‌లో కనిపిస్తానని.. సినిమా చాలా ఎంటర్‌టైనింగ్‌గా సాగుతుందని చెప్పింది లావణ్య త్రిపాఠి. సతీ లీలావతిలో చూపించినట్టుగా రిలేషన్స్ బయటిప్రపంచంలో ఉండవు. అలాంటి పరిస్థితి ఏ మహిళకు రాకూడదు. నేను ప్రెగ్నెంట్ కదా అని మూవీ స్క్రిప్ట్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. కాని యాక్షణ్ సీక్వెన్స్‌లో మార్పులు చేశారు. తొలిసారి నేను యాక్షన్ సీక్వెన్స్ చేశాను. సినిమాలో కాలితో కొట్టే సీన్ ఒకటి చేసినప్పుడు ఇబ్బందిగా అనిపించిందని చెప్పుకొచ్చింది. ఇందులో సీనియర్ యాక్టర్ నరేశ్, వీటీవీ గణేశ్ అద్భుతమైన పాత్రలు పోషించారు. చాలా వినోదాత్మకంగా ఉంటుంది. ఈమూవీని కమల్ హాసన్ సతీ లీలావతితో పోల్చలేం కానీ ఎంటర్‌టైనింగ్‌గా సాగుతుంది. అదొక క్లాసికల్ మూవీ. దాంతో ఈ సినిమాను పోల్చకూడదంది. సతీలీలావతి చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ బ్యానర్లపై నాగమోహన్ బాబు ఎం, రాజేష్ టి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నాడు.

